Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 129 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 26 - 11 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## రాజ్యాంగ రక్షణే ధ్యేయం

### (నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా)


THE CONSTITUTION OF INDIA

PREAMBLE

WE, THE PEOPLE OF INDIA, having solemnly resolved to constitute India into a SOVEREIGN SOCIALIST SECULAR DEMOCRATIC REPUBLIC and to secure to all its citizens:

JUSTICE, social, economic and political;

LIBERTY of thought, expression, belief, faith and worship;

EQUALITY of status and of opportunity; and to promote among them all

FRATERNITY assuring the dignity of the individual and the unity and integrity of the Nation;

IN OUR CONSTITUENT ASSEMBLY this twenty-sixth day of November, 1949, do HEREBY ADOPT, ENACT AND GIVE TO OURSELVES THIS CONSTITUTION.




అనేక జాతులు, తెగలు, విశ్వాసాలు, మతాలు ఉన్న మనదేశ పౌరులను ఒక్కటిగా ఉంచేదే మన రాజ్యాంగం. మతాన్ని, దేవుళ్లను రాజకీయాల్లోకి తెచ్చి, అణగారిన, మైనార్టీలపై మూక దాడులు జరుపుతున్నప్పుడు రాజ్యాంగం ఓడిపోతోందని గుర్తించండి. దశాబ్దకాలంగా ధనవంతులు మరింత కుబేరులుగా మారుతుంటే పేదలు మరింత అట్టడుగు స్థాయికి దిగజారుతున్నారు. దళితులు, ఆదివాసీలు, అత్యల్పవర్గాలు, మహిళలపై హంతక దాడులు జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అనివార్యం. హిందువులకు-గీత, ముస్లింలకు ఖుర్ ఆన్, క్రైస్తవులకు బైబిల్ ఎంత పవిత్రమైందో భారతీయులకు రాజ్యాంగం అంతే పవిత్రం. అందుకే రాజ్యాంగాన్ని కాపాడుకోవడం దేశభక్తికి ప్రతీక. విద్యే మన దైవం సైన్స్ మాత్రమే సత్యం మానవత్వమే మతం రాజ్యాంగమే మన గ్రంథం అని ప్రజలంతా గుర్తించాలి. మాన్య శ్రీ కన్షీరాం ఏం చెప్పారంటే.. కేవలం ప్రాణాలు కోల్పోయిన వారే మరణించినట్లు కాదు.. తమహక్కులు, అధికారాలు చేజారుతున్నప్పుడు కూడా ఎవరైతే చూస్తూ ఉండిపోతారో వాళ్లు కూడా మరణించినట్లేనన్నారు. ప్రస్తుతం మన మతగ్రంథాల స్థానాన్ని రాజ్యాంగం తీసుకుంది. మన హక్కులను తెలుసుకోవాలంటే రాజ్యాంగాన్ని అధ్యయనం చేయాల్సిందే. మన రాజ్యాంగంలోనే భగవంతుడిని కనుగొనవచ్చని భారతదేశ సుప్రీంకోర్టు 38వ ప్రధాన న్యాయమూర్తి ఎస్ హెచ్ కపాడియా తెలిపారంటే రాజ్యాంగ పరిరక్షణకు ఎంత ప్రాధాన్యత ఉందో కదా..రాజ్యాంగ రచనకోసం మొట్టమొదటి సభ డిసెంబర్ 9, 1948లో జరిగింది. దీనిని రూపొందించడానికి 2 సంవత్సరాల 11 నెలల, 18 రోజులు పట్టాయి. దీనిని రూపొందించడానికి రూ.3,96,329 ఖర్చయ్యాయి. రాజ్యాంగంలో మొత్తం 1,45,000 పదాలున్నాయి. ఇందులో మొత్తం 284 మంది సంతకాలున్నాయి. 1949 నవంబరు 26 నాటికి అందుబాటులోకి రాగా, జనవరి 26 1950 నుంచి అమలులోకి వచ్చింది. మునుపెన్నడూ లేని విధంగా రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలపై దారుణమైన దాడులు జరుగుతున్నాయి. అన్ని వర్గాల వారికి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని అందించే మన రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడానికి పాలుకులు జరుపుతున్న ప్రయత్నాలను తక్షణమే నిరోధించాలి. భారత రాజ్యాంగం ప్రపంచంలో నే అత్యున్నతమైందని, దీనిని సంపూర్ణంగా అమలు చేస్తే భూలోకంలో స్వర్గాన్ని సృష్టించవచ్చని ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ అంటానియో గుటెర్రస్ అన్నారు. మన రాజ్యాంగం నచ్చనివారు దేశం విడిచి వెళ్లవచ్చని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు రాందాస్ అథవాలే కోరుతున్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన పరిపాలన, శాసనసభలతోపాటు స్వతంత్ర సంస్థలైన జ్యుడీషరీ, ఎన్నికల కమిషన్ లకు జవసత్వాలు కల్పించాలంటే కట్టుదిట్టంగా రాజ్యాంగాన్ని అమలు చేయడం తప్ప మరో మార్గం లేదు. పోసుకోలు కబుర్లు, మత విశ్వాసాలు, మనోభావాల పేరుతో చర్చలు, వాదోపవాదాలు ప్రసారం చేస్తూ ..మధ్య తరగతి ప్రజల దాచుకున్న రూ.34 వేల కోట్లను అప్పనంగా ఆదానీకి అందజేసినా ప్రజలకు తెలియ చేయని మీడియాపై రాజ్యాంగ కొరడా ఝుళిపించాల్సిందే.. ఇవన్నీ జరగి.. ప్రజలంతా ప్రశాంతంగా జీవించాలంటే మొదట మనమంతా రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి.

– రచయిత : **వీఎస్**

## సాధ్యమైనంత త్వరగా అమరావతిలో జర్నలిస్ట్ హౌసింగ్ ప్రాజెక్ట్ అమలు : మంత్రి పార్థసారధి హామీ



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర రాజధాని అమరావతిలో జర్నలిస్ట్ హౌసింగ్ ప్రాజెక్ట్ అమలు చేసే విషయంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అమరావతి జర్నలిస్టు హౌసింగ్ ప్రాజెక్ట్ పై రాష్ట్ర సమాచార మరియు గృహనిర్మాణ శాఖ మంత్రికె పార్థసారధి సానుకూలంగా స్పందించారు. ఈ విషయంపై మంత్రి పార్థసారథిని అమరావతి జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు మరియు పలవురు సీనియర్ జర్నలిస్టులు ఇక్కడి ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో మంగళవారం నాడు కలిశారు. జర్నలిస్టుల కోసం సిఆర్డీఏ ఆధ్వర్యంలో బహుళ అంతస్థుల గృహ సముదాయాన్ని నాలుగు కేటగిరీలలో నిర్మించే నిమిత్తం 30 ఎకరాల భూమిని మందడం, తుళ్లూరు పరిధిలో అమరావతి హౌసింగ్ సొసైటీకి 2019లో కేటాయించటం జరిగిందని వారు వివరించారు. దానిని తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తూ సిఆర్డీఏ సంస్థనే డెవలపర్‌గా దాని ఆధ్వర్యంలోనే ప్రాజెక్ట్ నిర్మించాలని సొసైటీ గతంలో ప్రభుత్వాన్ని కోరింది. ఇందు నిమిత్తమే సొసైటీకి కేటాయించిన భూమిని తిరిగి ప్రభుత్వానికి ఇవ్వటం జరిగింది. అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంగీకరించిన నేపథ్యంలో ప్రభుత్వం జీవో నెంబర్ 107 ఇస్తూ హ్యాపీనెస్ట్ మోడల్‌లో నిర్మిస్తామని పేర్కొంది. ఇప్పుడు ఆ ఉత్తర్వులు అమలు జరిగేలా చూడాలని కోరుతూ పార్థసారథిని అమరావతి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో పాటు సీనియర్ జర్నలిస్టులు కోరడం జరిగింది. అందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను మరియు హౌసింగ్ సొసైటీ విజ్ఞప్తిని మంత్రి నారాయణ మరియు సిఆర్డీఏ కమిషనర్ దష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. దీనిని సాధ్యమైనంత త్వరగా అమలు జరిగేలా అవసరమైన వారితో సంప్రదింపులు జరుపుతామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా మంత్రి సారధి గారు వెంటనే సమాచార శాఖ డైరక్టర్ విశ్వనాధ్‌కి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సమాచార శాఖ డైరక్టర్ కూడా ఈ విషయంపై సత్వరమే సంప్రదింపులు జరుపుతామని ఆయనను కలిసిన జర్నలిస్టు సంఘ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో అమరావతి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి పాటిబండ్ల నాగశ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్లు చావా రవి, టివి 9 ఈశ్వర్, మహాటివి శ్రీనివాస్ మరియు సీనియర్ జర్నలిస్టులు ఆంధ్రప్రభ బ్యూరోఛీఫ్ గోపీ, ఆంధ్రజ్యోతి సత్యనారాయణ, హిందూ డిప్యూటీ ఎడిటర్ శ్రీనాధ్, ఎస్ మల్లిఖార్జున్, బి.నాగేశ్వరరావు ఉన్నారు.

## ఏపీలో కొత్తగా మూడు జిల్లాలు.. సీఎం అంగీకారం

**అమరావతి, (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జిల్లాల పునర్విభజన, డివిజన్లు, మండలాల మార్పు చేర్పులపై సచివాలయంలో కీలక సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా మూడు జిల్లాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ముందు నుంచి చెబుతున్నట్టుగా మార్కాపురం, మదనపల్లి జిల్లాల ఏర్పాటుకు మంత్రివర్గం ఓకే చెప్పింది. అలాగే రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు అంగీకరించారు. మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై సమీక్ష నిర్వహించిన అనంతరం మార్పులు చేర్పులకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేసేందుకు కూడా అంగీకరించారు. అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, ప్రకాశం జిల్లాలో అద్దంకి, కొత్తగా ఏర్పాటయ్యే మదనపల్లి జిల్లాలో పీలేరు, నంద్యాల జిల్లాలో బనగానపల్లె, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర రెవెన్యూ డివిజన్లు ఏర్పాటుకు నిర్ణయించారు. కర్నూలు జిల్లా పెద్ద హరివనాన్ని కొత్త మండలంగా ఏర్పాటుకు నిర్ణయం



తీసుకోగా.. ఆదోని మండలాన్ని విభజించి కొత్త మండలం ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి ఓకే చెప్పారు. ఇక కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు సంబంధించి ఈ సాయంత్రం ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది.

## మన సంస్కృతి, నాగరికత.. దేశానికి పునాది వంటివి

**అమరావతి, (రాజధాని వార్తలు):** మన సంస్కృతి, నాగరికత భారత దేశానికి పునాదిగా ఉన్నాయని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. సనాతన ధర్మం యొక్క లోతైన జ్ఞానం మనకు సహనం, శాంతి, సామరస్యంతో పాటు.. సృష్టి పట్ల లోతైన గౌరవాన్ని నేర్పిందని తెలిపారు. వలస పాలకులు, తూర్పు భారతదేశ వ్యాపారులు కలిసి మన భౌతిక సంపదను దోచుకోవడమే కాకుండా న్యూనత, తక్కువ ఆత్మగౌరవం వంటి విత్తనాలను కూడా నాటారని అన్నారు. మేధో, సాంస్కృతిక విధ్వంసాన్ని థామస్ బాబింగ్టన్ మెకాలే వంటి వ్యక్తులు చాకచక్యంగా ప్రణాళిక చేసి అమలు చేశారని చెప్పారు. వారు ఇంగ్లీషును సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడని, మన సొంత వారసత్వం గురించి సిగ్గుపడటం నేర్పిన మేధో.. సాంస్కృతిక బానిసత్వానికి ఒక బ్లూప్రింట్ వంటి వారని అభివర్ణించారు. వలసవాదులు భౌతికంగా వెళ్లిపోయిన చాలా కాలం తర్వాత కూడా.. ఈ వలస మనస్తత్వానికి సంబంధించిన హ్యాంగోవర్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మన సొంత గుర్తింపును తిరిగి పొందేందుకు.. నిర్ణయాత్మక చొరవ తీసుకున్నందుకు సంతోషంగా ఉందని డిప్యూటీ



సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. రేస్‌కోర్స్ రోడ్ పేరును లోక్ కళ్యాణ్ మార్గ్‌గా మార్చడం ప్రజల దృష్టిని సంక్షేమం వైపు మారుస్తుందన్నారు. ఈరోజు శ్రీరామ జన్మభూమి ఆలయంలో ధ్వజారోహణం (జెండా ఎగురవేయడం) కార్యక్రమం.. సాంస్కృతిక పునరుజ్జీవనం, నాగరికత ధృవీకరణను సూచిస్తుందని చెప్పారు. మనందరిలో భారత్ భవిష్యత్తు ఉందని.. మన మూలాలతో తిరిగి కనెక్ట్ అవుదామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

# వచ్చే నాలుగేళ్లలో 12.59 లక్షల గృహాలను పూర్తి చేస్తాం

### - ఐదేళ్లలో 15.59 లక్షల గృహ నిర్మాణాల లక్ష్యానికి గాను ఇప్పటికే 3.00 లక్షలను పూర్తి చేశాం - పిఎంఏవై-1.0 క్రింద నిర్మాణాలు ప్రారంభించని 3.03 లక్షల గృహాలను కూడా పూర్తి చేస్తాం - రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలు అందరికీ 2029 కల్లా శాశ్వత గృహ వసతి కల్పిస్తాం - పిఎంఏవై-2.0 పథక గడువు ఈ నెలాఖరుతో ముగియనున్నది, అర్హులు అందరూ సద్వినియోగం చేసుకోవాలి : రాష్ట్ర గృహ నిర్మాణ & సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలు అందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర గృహ నిర్మాణ & సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ఐదేళ్లలో 15.59 లక్షల గృహ నిర్మాణాలను పూర్తి చేయాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ఉందని, ఇందులో ఇప్పటికే 3.00 లక్షల గృహాలను పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన 12.59 లక్షల గృహాలను వచ్చే నాలుగేళ్లలో పూర్తి చేయడం జరుగుతుంది మంత్రి తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ ఇప్పటికే పూర్తి చేసిన 3.00 లక్షల గృహాలతో పాటు వచ్చే ఉగాదికి 5.00 లక్షల గృహాలను, జూన్ కల్లా మరో 87 వేల గృహాలను పూర్తి చేయాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి గృహ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పిఎంఏవై-1.00 పథకం అమలు గడువును కేంద్రం మరో ఏడాది పాటు పొడిగించిన నేపథ్యంలో ఈ పథకం క్రింద ఇప్పటి వరకూ ప్రారంభం కాని



3.03 లక్షల గృహాలను కూడా ఈ ఏడాది డిశంబరు కల్లా పూర్తి చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉన్నట్లు ఆయన తెలిపారు. ఐదేళ్ల కాలంలో దాదాపు 15.59 లక్షల గృహాలను నిర్మించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ఉందని, అయితే వీటిలో పి.ఎం.ఏ.వై.-1.0 క్రింద 8.87 గృహాలు, పిఎంఏవై-2.0 అర్బన్ క్రింద 91 వేల గృహాలు మరియు పిఎంఏవై గ్రామీణ్ క్రింద 5.81 లక్షల గృహాలను నిర్మించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. వీటికి అదనంగా పిఎంఏవై-1.00 పథకం క్రింద ఇప్పటి వరకూ ప్రారంభం కాని 3.03 లక్షల గృహాలను కూడా ఈ ఏడాది డిశంబరు కల్లా పూర్తి చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉన్నట్లు ఆయన తెలిపారు. పిఎంఏవై గ్రామీణ్ క్రింద 5.81 లక్షల గృహాలను నిర్మించాలనే లక్ష్యం పెట్టుకోగా ఇప్పటికే 3.47 లక్షల మంది ఆవాస్ యోజన యాప్‌లో ధరఖాస్తు చేసుకోవడం జరిగిందని, ఇంకా ఎవరన్నా అర్హులు ఉంటే ఈ నెలాఖరులోపు ఈ యాప్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. 16 నెలల్లో 3 లక్షల గృహాలను పూర్తి చేశాం. ఈ గృహ నిర్మాణాలకు సంబందించి ప్రతిపక్ష పార్టీ సభ్యులు వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేయడం ఎంతో దురదృష్టకరమన్నారు. ఐదేళ్ల కాలంలో గత ప్రభుత్వం కేవలం 6.00 లక్షల గృహాలను మాత్రమే పూర్తి చేస్తే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 16 నెలల కాలవ్యవధిలోనే 3.192 లక్షల గృహాలను పూర్తి చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం 18.61 లక్షల గృహాలను మంజూరు చేసి, వాటిలో కేవలం 6.00 లక్షల ఇళ్లను మాత్రమే పూర్తి చేయడం జరిగిందన్నారు. అయితే 2014-19 మధ్య కాలంలో తమ ప్రభుత్వ హయాంలో 8.687 లక్షల గృహ నిర్మాణాలను పూర్తి చేయడం జరిగిందన్నారు. 2014-19 మధ్య కాలంలో ఎన్.టి.ఆర్.గృహ నిర్మాణ పథకం క్రింద మంజూరు చేసి వివిధ దశల్లో ఉన్న 4.7 లక్షల గృహాలను గత ప్రభుత్వం రద్దు చేయడమే కాకుండా పూర్తయిన 2.7 లక్షల గృహాలకు రూ.920 కోట్లు చెల్లింపు చేయకుండా ఎగ్గొట్టి ఎస్సీ, ఎస్టీ, బి.సి., ఇబిసి వర్గల వారికి అన్యాయం చేయడం జరిగిందన్నారు. అయితే తమ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా పక్షపాత దోరణితో ఏమాత్రం వ్యవహరించకుండా గత ప్రభుత్వం మంజూరు చేసి 18.61 లక్షల గృహాల్లో మిగిలి ఉన్న 11.90 లక్షల గృహ నిర్మాణాలను కొనసాగించడం జరుగుచున్నదన్నారు. అయితే ఈ ఇళ్లను మేమే ప్రారంభించాము అని గొప్పలు చెప్పుకుంటున్న గత ప్రభుత్వ ప్రతినిధులు వీటి నిర్మాణానికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఇళ్ల నిర్మాణానికై గత ప్రభుత్వం ఇచ్చిన

# మూడు కొత్త జిల్లాలకు గ్రీన్ సిగ్నల్

**- రాష్ట్రంలో 26 నుంచి 29కి పెరగనున్న జిల్లాల సంఖ్య - త్వరలో పోలవరం, మార్కాపురం, మదనపల్లె జిల్లాల ఏర్పాటు - కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లు, నూతనంగా ఒక మండలం - ఇక నుంచి వాసవీ పెనుగొండ మండలంగా పేరు మార్పు - జిల్లాల పునర్విభజనపై మంత్రుల కమిటీ సిఫార్సుకు సీఎం చంద్రబాబు ఆమోదం - కేబినెట్ ముందుకు ప్రతిపాదనలు- అనంతరం నోటిఫికేషన్**



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో కొత్తగా మూడు జిల్లాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదాన్ని తెలియచేశారు. మార్కాపురం, మదనపల్లె జిల్లాలు, రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు సీఎం నిర్ణయించారు. మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించిన సీఎం ఈ మార్పు చేర్పులకు ఆమోదాన్ని తెలియచేశారు. ఈ నిర్ణయంతో మొత్తంగా రాష్ట్రంలో 29 జిల్లాలు ఏర్పడనున్నాయి. అలాగే కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేసేందుకు కూడా అంగీకారం తెలిపారు. అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, ప్రకాశం జిల్లాలో అద్దంకి, కొత్తగా ఏర్పాటయ్యే మదనపల్లి జిల్లాలో పీలేరు, నంద్యాల జిల్లాలో బనగానపల్లె, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర రెవెన్యూ డివిజన్లు ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. కర్నూలు జిల్లా ఆదోని మండలాన్ని విభజించి కొత్తగా పెద్దహరివనం మండలాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**మూడు జిల్లాల భౌగోళిక స్వరూపం ఇలా**

పోలవరం జిల్లా: రంపచోడవరం నియోజకవర్గంలోని రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లతో కొత్తగా పోలవరం జిల్లా ఏర్పాటు కానుంది. రంపచోడవరం రెవెన్యూ డివిజన్ లో రంపచోడవరం, దేవీపట్నం, వైరామవరం, గుర్తేడు, అడ్డతీగల, గంగవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి మండలాలు ఉండనున్నాయి.

ఇక చింతూరు డివిజన్ లో యెటపాక, చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం మండలాలను చేర్చారు. రంపచోడవరం కేంద్రంగా కొత్తగా ఏర్పాటయ్యే పోలవరం జిల్లాలో 3.49 లక్షల జనాభా ఉంది.

మార్కాపురం జిల్లా : యర్రగొండపాలెం, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లోని మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లతో కొత్త జిల్లాగా మార్కాపురం ఏర్పాటు కానుంది. మార్కాపురం రెవెన్యూ డివిజన్‌లోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు,తర్లుపాడు, మార్కాపురం, పొదిలి, కొనకనమిట్ల మండలాలు, అలాగే కనిగిరి డివిజన్ లోని హనుమంతుని పాడు, వెలిగండ్ల, కనిగిరి, పెదచెర్లోపల్లి, చంద్రశేఖరపురం, పామూరు, గిద్దలూరు, బేస్తవారిపేట, రాచర్ల, కొమరోలు, కంభం, అర్ధవీడు మండలాలు కొత్తజిల్లాల్లో ఉండనున్నాయి. మొత్తం 11.42 లక్షల జనాభాతో ఈ జిల్లా ఏర్పాటు కానుంది.

మదనపల్లి జిల్లా: మదనపల్లి, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాల్లోని మదనపల్లె, పీలేరు రెవెన్యూ డివిజన్లతో కొత్తగా మదనపల్లి జిల్లా ఏర్పాటు కానుంది. మదనపల్లి రెవెన్యూ డివిజన్ లోని మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, తంబళ్లపల్లె, ములకల చెరువు, పెదమండ్యం, కురబలకోట, పీటీ సముద్రం, బీరొంగి కొత్తకోట, చౌడేపల్లె, పుంగనూరు మండలాలు, అలాగే పీలేరు డివిజన్‌లోని సదుం, సోమల, పీలేరు, గుర్రంకొండ, కలకడ, కంభంవారి పల్లె, కలికిరి, వాల్మీకిపురం మండలాలు ఉండనున్నాయి. మొత్తం 11.05 లక్షల జనాభాతో కొత్త జిల్లా ఏర్పడనుంది.

**రెవెన్యూ డివిజన్లలో మార్పు చేర్పులివీ**

శ్రీకాకుళం జిల్లా పలాస డివిజన్‌లోని నందిగాం మండలాన్ని టెక్కలి డివిజన్‌లో కలిపేందుకు మంత్రుల కమిటీ చేసిన సిఫార్సుకు ఆమోదం తెలిపారు. అనకాపల్లి జిల్లాలోని పాయకరావుపేట- యలమంచిలి నియోజకవర్గాల్లోని మండలాలతో కొత్తగా నక్కపల్లి రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. కాకినాడ డివిజన్‌లోని సామర్లకోట మండలాన్ని పెద్దాపురం డివిజన్‌లో విలీనం చేసేందుకు ఆమోదం తెలిపారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట నియోజకవర్గంలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, మండలాలను రాజమహేంద్రవరం డివిజన్‌లో కలపాలని నిర్ణయం తీసుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని పెనుగొండ మండలాన్ని ఇక నుంచి వాసవీ పెనుగొండ మండలంగా పేరు మార్చనున్నారు. బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపనున్నారు. దీంతో పాటు అద్దంకి, దర్శి నియోజకవర్గాల్లోని మండలాలను కలుపుతూ కొత్తగా అద్దంకి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది. ప్రస్తుతం కనిగిరి రెవెన్యూ డివిజన్‌లో ఉన్న మర్రిపూడి, పొన్నలూరు మండలాలను కందుకూరు రెవెన్యూ డివిజన్‌లో కలపనున్నారు. కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో విలీనం చేయనున్నారు. నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి, రాపూర్, సైదాపురంలను తిరుపతి జిల్లా గూడురు డివిజన్‌లో విలీనం చేయనున్నారు. పలమనేరు డివిజన్‌లోని బంగారుపాళ్యంను చిత్తూరు డివిజన్‌లో కలుపనున్నారు. సదుం, సోమల, పీలేరు, గుర్రం కొండ, కలకడ, కేబీ పల్లి, కలికిరి, వాల్మీకిపురం మండలాలతో పీలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది. పలమనేరు డివిజన్‌లోని చౌడేపల్లి, పుంగనూరు మండలాలను మదనపల్లి రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేయనున్నారు. కడప జిల్లాలోని ఒంటిమిట్ట, సిద్ధవటంలను రాజంపేట రెవెన్యూ డివిజన్‌లో కలపనున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని మడకశిరను కొత్త రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయనున్నారు. కదిరి డివిజన్ లోని ఆమడగూరు మండలాన్ని పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేయనున్నారు. పుట్టపర్తి డివిజన్‌లో ఉన్న గోరంట్ల మండలాన్ని పెనుకొండ డివిజన్‌లో కలపనున్నారు. నంద్యాల జిల్లా డోన్ రెవన్యూ డివిజన్‌లోని బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల నంద్యాల డివిజన్ లోని సంజామల, కొలిమిగుండ్ల మండలాలతో కొత్తగా బనగానపల్లె రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది.

**9 జిల్లాల్లో ఎలాంటి మార్పులూ లేవు**

మంత్రుల కమిటీ సిఫార్సులతో కొత్తగా ఏర్పాటు చేసే జిల్లాలు, రెవెన్యూ డివిజన్లతో ప్రస్తుతం ఉన్న 17 జిల్లాల్లో మార్పు చేర్పులు చోటు చేసుకున్నాయి.

మిగతా 9 జిల్లాలు విజయనగరం, పార్వతీ పురం మన్యం, విశాఖపట్నం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుం టూరు, పలనాడు, అనంతపురం జిల్లాల్లో ఎలాంటి మార్పులు జరగలేదు. మంత్రుల కమిటీ చేసిన ఈ ప్రతిపాదనలు వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చించనున్నారు. మంత్రివర్గం ఆమోదం అనంతరం కొత్త జిల్లాల ఏర్పాటు, రెవెన్యూ డివిజన్ల మార్పు చేర్పులపై అధికారిక నోటిఫికేషన విడుదల కానుంది.

# సంక్రాంతి వరకూ ఆప్కోలో డిస్కౌంట్ అమ్మకాలు

**- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత - 40 శాతం డిస్కౌంట్ కు చేనేత అమ్మకాలు - డిస్కౌంట్ అమ్మకాలతో పెరిగిన రోజువారీ విక్రయాలు - రూ.3 లక్షల నుంచి రూ.9 లక్షలకు పెరిగిన అమ్మకాలు - త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా చేనేత బజార్లు : మంత్రి సవిత**



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రజలకు ఆప్కో మరోసారి గుడ్ న్యూస్ తెలిపింది. వినియోగదారుల నుంచి వస్తున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని వచ్చే సంక్రాంతి వరకూ ఆప్కో షో రూమ్‌ల ద్వారా 40 శాతం డిస్కౌంట్‌కు చేనేత వస్త్రాలు విక్రయించనున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మారుతున్న అభిరుచుల దృష్ట్యా ప్రజల్లోనూ చేనేత వస్త్రాల వినియోగంపై మక్కువ పెరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో దసరా, దీపావళి పండుగలను దృష్టిలో పెట్టుకుని ఆప్కో షో రూమ్ ల్లో చేనేత వస్త్రాలను 40 శాతం డిస్కౌంట్ పై విక్రయించిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. ప్రజలు, వినియోగదారుల నుంచి వచ్చిన స్పందన నేపథ్యంలో డిస్కౌంట్ అమ్మకాలు వచ్చే సంక్రాంతి వరకూ కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. డిస్కౌంట్‌లో అమ్మకాలతో అటు ప్రజలకు చేనేత వస్త్రాలను మరింత చేరువ చేసే అవకాశం కలుతోందన్నారు. అదే సమయంలో చేనేత వస్త్రాల విక్రయాల పెరుగుదలతో నేతన్నలకు ఆర్థిక భరోసాతో కూడిన ఉపాధి లభిస్తోందని తెలిపారు.

**రూ.9 లక్షలకు పెరిగిన అమ్మకాలు**

40 శాతం డిస్కౌంట్‌కు ఆప్కో షో రూమ్‌ల ద్వారా చేనేత వస్త్రాలను విక్రయించడం వల్ల అమ్మకాలు సైతం పెరిగినట్లు మంత్రి సవిత వెల్లడించారు. డిస్కౌంట్ ఇవ్వడానికి ముందు రాష్ట్ర వ్యాప్తంగా ఆప్కో షో రూమ్‌ల ద్వారా రోజుకు సరాసరి రూ.3 లక్షల చొప్పున విక్రయాలు జరిగేవన్నారు. 40 శాతం డిస్కౌంట్ తో అమ్మకాలు ప్రారంభించిన తరవాత రోజువారీ అమ్మకాలు రూ.9 లక్షలకు పెరిగినట్లు మంత్రి సవిత తెలిపారు. డిస్కౌంట్ విక్రయాలతో పాటు చేనేత వస్త్రాల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. ప్రస్తుత ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని చిన్నారులతో పాటు ఆయా వయస్సుల వారికి అవసరమైన రెడీ మేడ్ చేనేత వస్త్రాలను ఆప్కో షో రూమ్‌ల్లో విక్రయిస్తున్నామన్నారు. దీంతో చేనేత వస్త్రాల కొనుగోలు పెరిగినట్లు మంత్రి సవిత తెలిపారు.

**రాష్ట్ర వ్యాప్తంగా చేనేత బజార్లు**

చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అన్ని ప్రణాళికలు రూపొందిస్తోందని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో చేనేత బజార్లు, ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే విజయవాడ, గుంటూరు, రాజమండ్రిలో చేనేత ఎగ్జిబిషన్లు నిర్వహించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. త్వరలో విశాఖ, కర్నూలు, కడప వంటి నగరాలతో పాటు ఇతర జిల్లా కేంద్రాల్లోనూ చేనేత ఎగ్జిబిషన్లు, బజార్లు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి సవిత ఆ ప్రకటనలో తెలిపారు.

# మానవత్వానికి చెదలు పడుతున్నాయి..!

**- సూఫీ అభిషిక్తులు ఖలీల్ బాబు ఆవేదన - వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ**






**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రపంచంలో ఎక్కడైనా అనాధ ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలు పెరిగిపోతున్నాయంటే..అక్కడ మానవత్వానికి చెదలు పడుతున్నాయన్న సంకేతాన్ని సూచిస్తుందని సూఫీ అభిషిక్తులు, హజరత్ ఖాదర్ బాబా దర్గా దర్బార్ షరీఫ్ ముతవల్లి డాక్టర్ ఎండీ ఖలీల్ బాబు తన ఆవేదన వ్యక్తం చేశారు. మానవత్వానికి మాతృకగా నిలిచే సూఫీ పరంపర దక్షిణ భారత సూఫీ సామ్రాట్, దైవాంశ సంభూతులు, మహర్షి ఖాదర్ బాబా వారి ప్రియ శిష్యులు హజరత్ ఖ్వాజా మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా (ర.ఆ.) వారి 89వ జన్మ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సామాజిక సేవకులు, వైద్యులు, బాబా ప్రేమికులైన డాక్టర్ అవసరాల శ్రీధర్, సంతోష్ సోదరులతో కలిసి ఖలీల్ బాబు ఏటికే వెలుగు ఆశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంచిపెట్టారు. పరిసరాల పిల్లలకు, యువకులకు పండ్లు పంచారు. ఈ సందర్భంగా ఖలీల్ బాబు మాట్లాడుతూ, మనసుల్లో ప్రేమ దూరమైతే, మనుషుల మధ్య బంధాలు దూరమవుతాయని, మనిషి హృదయం మలినమైపోతూ ఉంటే మానవత్వం చచ్చిపోతూ ఉంటుందని అన్నారు.

ఎవరైతే తమ హృదయాల్లో ప్రేమను నింపుకుని సత్ కార్యాలు చేస్తారో వారిపై దైవం కరుణ తప్పక ఉంటుందని ఖలీల్ బాబు ఉద్బోధించారు. సాటి మనిషిని ప్రేమిస్తూ, వారి బాధల్లో పాలు పంచుకోవాలని ప్రతీ ఒక్కరినీ కోరుకుంటూ, సూఫీ చంద్రబింబం ఖాదర్ బాబా వారి దయ, కరుణ, కటాక్షం ప్రతీ ఒక్కరిపై ప్రసురించాలని, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఖలీల్ బాబు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాబా సేవకులు రంగారావు బాబాయ్, సోషల్ సర్వీస్ యూత్ అంబాసిడర్ ఎండీ అహమ్మద్ బాబు, జుజ్జూరు ఖాదర్, నాగూర్, జర్నలిస్ట్ జైరాజ్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్ ఎక్స్‌పోను విజయవంతం చేయాలి

**- పరిశ్రమల స్థాపనకు రాష్ట్రం ఎంతో అనుకూలం - సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి**




**విజయవాడ, (రాజధాని వార్తలు):** డిసెంబర్ 12,13,14 తేదీల్లో ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బిజినెస్ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నట్లు సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 12 నుండి 14 తేదీల్లో మూడు రోజుల పాటు విజయవాడ ఎస్ ఎస్ కన్వెన్షన్‌లో నిర్వహించనున్న బిజినెస్ ఎక్స్‌పోకు సంబంధించిన బ్రోచర్, ఏపీ లోగోను లాంఛనంగా మంగళవారం గుణదలలోని హోటల్ హయత్‌లో విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మంత్రి కొలుసు పార్థసారథి హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలతతో ముందుకు వెళ్లుతుందన్నారు. శాంతియుత వాతావరణంలో రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్రంలో పెట్టేందుకు ముందుకు వచ్చే వారి కోసం అనేక రాయితీలతో కొత్తగా పారిశ్రామిక పాలసీలను ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకొచ్చేందుకు అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. పెట్టుబడులు తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపినిచ్చారని ఈ నేపథ్యంలో ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. నూజివీడు లాంటి అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో పరిశ్రమల స్థాపనకు అనేక సానుకూల అంశాలు, మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, ఆ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బిజినెస్ ఎక్స్‌పోను పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు, ప్రజలు సద్వినియోగం చేసుకుని రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచేలా విజయవంతం చేయాలని దీనికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ మద్దతు అందిస్తుందని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.

బిజినెస్ ఎక్స్ పో ప్రత్యేకతలు: గత సంవత్సరం బిజ్ నెస్ ఎక్స్ పో కంటే మెరుగ్గా ఈ ఏడాది నిర్వహించనున్నారు. ఈ వేదిక ద్వారా కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించడం, పర్యాటక రంగం, ఫుడ్ ప్రాసెసింగ్, హాస్పిటాలటీ వంటి సెక్టార్స్ ఉంటాయన్నారు. సెమినార్ల నిర్వహణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనేకరకాల ఉత్పత్తులను ఈ వేదిక ద్వారా ప్రమోట్ చేయనున్నారు. ప్రతి రోజూ సాయంత్రం అనేక రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ కార్యక్రమంలో ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు, జనరల్ సెక్రటరీ రావూరి సుబ్బారావు, కోశాధికారి ఎస్. అక్కయ్య నాయుడు, ఏపీ స్టార్ హెూటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్వీ స్వామి, తదితరలు పాల్గొన్నారు.

# పాఠశాల విద్యార్థులచే శాసనసభ నమూనా సమావేశం

**అమరావతి, (రాజధాని వార్తలు):** భారత రాజ్యాంగ దినోత్సవం – 2025ను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో "పాఠశాల విద్యార్థులచే శాసనసభ నమూనా సమావేశం" కార్యక్రమం ఈ నెల 26 వ తేదీ బుధవారం ఉదయం 9.00 గంటలకు అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రాంగణంలో నిర్వహించబడుచున్నది. పాఠశాల విద్యార్థుల్లో రాజ్యాంగ పట్ల గౌరవం, భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, శాసనసభా ప్రక్రియలు మరియు ప్రజా ప్రతినిధుల పాత్రలపై అవగాహన కల్పించడంతో పాటు నాయకత్వ లక్షణాలను, నైపుణ్యాలను పెంపొందించడమే ముఖ్య లక్ష్యం ఈ "మాక్ డ్రిల్ అసెంబ్లీ" నిర్వహించడం జరుగుచున్నది. రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్, ఆర్టీజీ శాఖల మంత్రివర్యులు నారా లోకేష్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు సమాచార శాఖ సహాయ మంత్రివర్యులు డా. పెమ్మసాని చంద్రశేఖర్, ఉప ముఖ్యమంత్రి వర్యులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, పర్యావరణం, అటవీ శాఖ మరియు సైన్స్ & టెక్నాలజీ శాఖల మంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక & సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు మరియు గుంటూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేష్ విశిష్ట అతిథులుగా హాజరు కానున్నారు. రాష్ట్ర మంత్రులు మరియు విద్యార్థుల నీతి మరియు విలువలు సలహాదారులు చాగంటి కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్, మయాన జకీయా ఖానమ్, ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, చీఫ్ విప్‌లు & విప్‌లు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు, మేయర్లు, పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, కార్పొరేషన్ చైర్‌పర్సన్లు, గ్రంథాలయ సంస్థ & ఇతర ప్రజా ప్రతినిధులు గౌరవ అతిథులుగా ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు. అదే విధంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, పాఠశాల విద్య, ఉన్నత విద్య మరియు నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు వి, గుంటూరు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ ఎ.తమీమ్ అన్సారియా మరియు సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ప్రత్యేక అతిథులుగా ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు.

# విపిఆర్ దంపతులను మర్యాదపూర్వకంగా కలిసిన జడ్పీ సీఈవో




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులను నూతన జడ్పీ సీఈవో శ్రీధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఆయనను జిల్లా పరిషత్‌కు కొత్త సీఈవోగా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో సోమవారం నగరంలోని విపిఆర్ నివాసానికి వచ్చిన ఆయన.. విపిఆర్ దంపతులను కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా అందించాలని సూచించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నెల్లూరు నగర కార్పొరేషన్ మేయర్‌పై అవిశ్వాస తీర్మానంకు అంతా సిద్ధం




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసిన కార్పొరేటర్లు అవిశ్వాసం తెలిపేందుకు ఓటింగ్‌కు అవకాశం ఇవ్వాలని వినతి. సుమారు 40 మంది కార్పొరేటర్లు సంతకాల పిటిషన్‌ను జాయింట్ కలెక్టర్‌కు సమర్పించిన డిప్యూట్ మేయర్ రూప్ కుమార్ యాదవ్, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి తరపున కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మంత్రి నారాయణ తరపున నారాయణ కాలేజీల జిఎం వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డిలతో కలిసి మద్దత్తుగా వెళ్ళిన టిడిపి కార్పొరేటర్లు రెండిటికీ చెడ్డ రేవడిలా తయారైన ప్రస్తుత మేయర్ పొట్లూరి స్రవంతి. నిన్నటితో నెల్లూరు నగర కార్పొరేషన్‌లో మేయర్‌గా 4 సంవత్సరాలు పూర్తి చేసుకున్న స్రవంతి కష్టమో నష్టమో ఏదైనా ఒక పార్టీతో వుండాలి కానీ సమయానికి అవసరానికి ఒక పార్టీ వైపు మొగ్గు చూపడం తోనే మేయర్‌కు ఈ పరిస్థితి వచ్చిందన్న రాజకీయ పెద్దలు ఇంకో సంవత్సరం రోజులు కార్పొరేషన్ కుక్కలు చింపిన విస్తరి లా మారబోతుందా? దోచుకునేందుకు కొందరికి ఇది పెద్ద సదవకాశంగా మారబోతుందా? మున్సిపల్ శాఖా మంత్రి సొంత ఇలాకా కార్పొరేషన్‌లో ఇప్పటికే అనేక అవినీతి ఆరోపణలు, రాజకీయ కుమ్ములాటలు, ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరిన నేపథ్యంలో ఇప్పుడు అవన్నీ నారాయణ ఎలా హ్యాండిల్ చేస్తారో చూడాలి.

# 46వ డివిజన్‌లో విజయవంతంగా పూర్తి చేసిన కోటి సంతకాల కార్యక్రమం

**- పూర్తి చేసిన 3 వేల కాపీలను పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి అందజేసిన కార్పొరేటర్ వేలూరు ఉమా మహేష్**




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరులో వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు 46వ డివిజన్ కార్పొరేటర్ వేలూరు ఉమా మహేష్ డివిజన్ నాయకులతో కలిసి కోటి సంతకాల సేకరణలో పూర్తి చేసిన 3 వేల కాపీలను పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి అద్భుత స్పందన లభించిందని చంద్రశేఖర్ రెడ్డికి వేలూరు ఉమా మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న పలువురు డివిజన్ నేతలను చంద్రశేఖర్ రెడ్డి అభినందించారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ వైసిపి నాయకులు వేలూరు రాదయ్య, లక్ష్మణా, కుమార్, శంకరయ్య, సుమన్, సుమంత్, చెంగయ్య, వెంకటేష్, రమేష్, సిద్దు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసత్యసాయి బాబా అవార్డు అందుకున్న డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ జి.వి. ప్రసాద్ రెడ్డి




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నెల్లూరులోని టౌనుహాలు నందు శ్రీ భగవాన్ సత్యసాయి బాబా 100వ జయంతి వేడుకలు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నెల్లూరులోని అపోలో హాస్పిటల్ నందు వైద్యులుగా వ్యవహరిస్తున్న డాక్టర్ పావులూరు శ్రీనివాసులు, డాక్టర్ జి.వి.వి.ప్రసాద్ రెడ్డిలకు శ్రీ భగవాన్ సత్య సాయి బాబా అవార్డును అందజేశారు. శాలువా,పూలమాల, మొమెంటో, మెడల్, కిరీట దారణతో ఘనంగా సత్కరించారు. ముందుగా సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, బి.జె.పి. రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, డాక్టర్ కొండూరు హరినారాయణ రెడ్డి, ఎస్.వి.రమేష్ బాబు, అందే శ్రీనివాసులు, దేవసాని కొండారెడ్డి, షేక్ రియాజ్ బాష, డాక్టర్ మధుసూదన్, బి.మురళీకృష్ణ, కామసాని కృష్ణారెడ్డి, దూర్జటి ప్రభాకర్, కె.మురళీమోహన్ రాజు, రవి గోగులపల్లి తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ప్రారంభమైన నారాయణ ప్రీమియర్ లీగ్ పోటీలు






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రామలింగాపురంలోని నారాయణ కాన్సెప్ట్ స్కూల్లో సోమవారం నారాయణ ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులకు నిర్వహించిన ఈ పోటీలలో విద్యార్థులు ఎంత ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు క్రీడా జ్యోతిని వెలిగించి వందన సమర్పణ చేశారు. నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి సూచనల మేరకు విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీఎం నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపడమే లీడ్ పోటీల లక్ష్యమన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్న ఉద్దేశంతో తమ పాఠశాలలో విద్యార్థులకు చదువుతోపాటు వివిధ క్రీడా పోటీల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు.క్రీడా పోటీలతో శారీరక దారుఢ్యం, మానసిక ఒత్తిడి నుండి ఉపశమనం కలుగుతుందని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సోనీ వెంగళరావు ఏవో శివ పీఈటీలు విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా విద్యార్థుల నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



# కాకాణి గోవర్ధన్ రెడ్డితో ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి భేటీ

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు డైకాస్ రోడ్డులోని వైసిపి జిల్లా కార్యాలయంలో వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డితో వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి. రూరల్ నియోజకవర్గ ఇంచార్జ ఆనం విజయకుమార్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు పలు పార్టీ అంశాల గురించి చర్చించుకున్నారు.

# నూతన వధువరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రూరల్ నియోజకవర్గం నవలాకుల తోట మాజీ సర్పంచ్ నాయకులు యనమల హరి యాదవ్ తనయుడు యనమల కిషన్ & సాయి మనస్విని వివాహ వేడుక నేడు కస్తూరి దేవి గార్డెన్స్ నందు అంగరంగ వైభవంగా జరిగింది ఈ వివాహ మహోత్సవానికి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ఆనం విజయ్ కుమార్ రెడ్డి కొండ్రెడ్డి రంగారెడ్డి డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ కోడూరు కమలాకర్ రెడ్డి విచ్చేసారు. ఈ సందర్భంగా వారు నూతన వధూవరులను ఆశీర్వదించారు. నిండు నూరేళ్ళు సుఖసంతోషాలతో జీవించాలని నిండు మనస్సుతో ఆశీర్వదించారు. అలాగే పలువురు కార్పొరేటర్లు ప్రజాప్రతినిధులు అధికారులు మిత్రుల వారి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

# సుదూర ప్రాంతాల నుండి జిల్లాకేంద్రానికి వచ్చే అర్జీదారుల సమస్యలకు పరిష్కారం చూపాలి : జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్వో విజయకుమార్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీధర్‌రెడ్డి, డి ఆర్ డి ఏ పీడీ నాగరాజు కుమారి, డ్వామ పిడి గంగాభవాని, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు రఘు రామ రాజు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు సవివరంగా వివరించాలన్నారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా మరియు మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ, ప్రత్యేక క్యూ లైన్లు తదితర ఏర్పాట్లు చేయడంతపాటు షామ్యానలు వేసి నీడను కల్పించారు.

# సంపాదకీయం

## కులాల లెక్కలతో జాతి నిర్మాణమా

కఠోర వాస్తవాలకు అక్షర రూపాలుగా, సిద్ధాంతాలుగా నిలిచినవి ఒకపట్టాన అంతరించిపోవు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం నినాదాలు ఫ్రెంచ్ విప్లవంతో హోరెత్తాయి. అవి సాకారం కావాలన్న తపన మనుషుల్లో బలంగా ఉండబట్టే ఇప్పటికీ అవి మారుమోగుతున్నాయి. మనుషులను తట్టిలేపుతూనే ఉన్నాయి. కడలి ఆటుపోటుల్లా కొంతకాలం వాటికి ప్రాబల్యం పెరగొచ్చు. తరగొచ్చు. పూర్తిగా సమసిపోవటమంటూ ఉండదు. సోషలిజం పేరుతో ఏర్పాటైన రాజ్యాలన్నీ కుప్పకూలిన తర్వాత మార్క్సిజం ప్రపంచం నుంచే అంతరించిపోతుందనే భావన కలిగింది. మానవమేధపై 150 ఏళ్ల మార్క్సిస్టు భావాల నియంతృత్వం తొలగిపోయిందని ఘనంగా ప్రకటనలూ వెలువడ్డాయి. ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభాలు కుదిపివేస్తున్నప్పుడూ, పర్యావరణం ప్రమాద స్థాయికి చేరుతోందన్న హెచ్చరికలు ప్రబలుతున్నప్పుడూ పరిష్కారాల అన్వేషణలో ఆ భావాలకు ప్రాధాన్యం ఏదో విధంగా వస్తూనే ఉంది. వాటిల్లో కొన్ని ఇప్పటి పరిస్థితులకు సరిపోకపోవచ్చు. కొన్నిటిని పరిపుష్టం చేయాల్సి రావొచ్చు, కొన్నిటిని వదులుకోవాల్సీ రావొచ్చు. కానీ అన్నిటినీ పూర్తిగా పక్కకుపెట్టే స్థాయికి మానవ సమాజం ఇంకా ఎదగలేదు. సంపద పంపిణీలో న్యాయబద్ధత ఉండాలనే మనుషుల యుగయుగాల తపనకు అక్షర రూపం ఇవ్వబట్టే అవి అంతరించటం లేదు. అలాగే మన చేతల్లో, చేతనలో, మంచిచెడుల అంచనాల్లో, ఎక్కువ తక్కువ కొలతల్లో కులదృష్టి ప్రబలంగా ఉన్నంతవరకూ 90 ఏళ్ల క్రితం అంబేడ్కర్ వ్యక్తంచేసిన భావాలకూ కాలదోషం పట్టదు. 'కులం పునాదులపై మీరు దేన్నీ నిర్మించలేరు. ఆ పునాదిపై జాతిని నిర్మించలేరు. ఆ పునాదిపై నైతికతను స్థాపించలేరు. ఆ పునాదిపై దేన్ని నిర్మించినా అది పగుళ్లు వారుతుంది. అసంపూర్ణంగా మిగిలిపోతుంది' అని అంబేడ్కర్ ఆనాడు చేసిన హెచ్చరికలో ఎంతో ప్రగాఢత, కఠోర సత్యం ఉన్నప్పటికీ సమకాలీన భారతం అందుకు వ్యతిరేక దిశలోనే వెళుతోంది. కులాలవారీగా మనుషులను లెక్కించి ఆ మేరకు పదవులూ, ఉద్యోగాలూ, విద్యా సీట్లనూ పంచాలన్న విధానాన్ని ఇటీవల కాలంలో కాంగ్రెస్ పార్టీ ఎంచుకుంటే.. బీజేపీ కూడా తన సిద్ధాంతాలను సవరించుకుని పరుగుపందెంలో రెండడుగులు ముందుకే వేసి అందరినీ ఆశ్చర్యపరచింది. లోక్‌సభ ఎన్నికల ప్రణాళికలో కులగణన గురించి ఒక్క ప్రస్తావన కూడా లేకుండా జాగ్రత్తపడిన బీజేపీ, బిహార్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునో, కాంగ్రెస్‌కు గట్టి రాజకీయ ప్రచారాస్త్రం లేకుండా చేయాలనో దానికి అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది చివర నుంచి ప్రారంభమయ్యే జనాభాగణనలో కులాలను లెక్కించటానికి మంత్రివర్గం ఆమోద ముద్ర కూడా వేసేసింది. కులాలకు సంబంధించి ఏ సమాచారాన్ని సేకరిస్తారన్న దాని గురించి ఇప్పటికింకా అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడి కాలేదు. కులాల వారీగా తలలెక్కలు తేల్చినంత మాత్రాన సామాజిక, ఆర్థికస్థితిగతులపై కొత్తవెలుగులేవీ ప్రసరించవు. ఎస్సీ, ఎస్టీల గణనకు సంబంధించి ఇప్పటి వరకూ అనుసరిస్తున్న పద్ధతులను మాత్రమే ఇతర కులాల తలలెక్కల విషయంలో అనుసరిస్తే ఎవరు ఎక్కడ ఉన్నారో తెలియటం చాలా కష్టం. సంపదల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యాపరంగా ఒక కులం ముందంజలో ఉందా? బాగా వెనుకబడి ఉందా? అన్నది తెలుసుకోలేం. జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీలు కులాలవారీగా ఎంతమంది ఉన్నారో తెలుస్తుంది. వారి అక్షరాస్యతా శాతాన్ని సులువుగా తెలుసుకోవచ్చు. పట్టణ, గ్రామీణాల్లో నివసించే శాతాలనూ గ్రహించొచ్చు. ఇంకాస్త కష్టపడి కూడికలు వేయగలిగితే విద్యా స్థాయిలనూ లెక్కించవచ్చు. వ్యవస్థీకృత, అవ్యవస్థీకృత రంగంలో ఎంతమంది పనిచేస్తున్నారో కూడా తెలుసుకోవచ్చు. ఇంతకుమించి సమాచారాన్ని తెలుసుకోలేం. కులంతో పాటు ఆర్థిక, ఉద్యోగ, విద్యా పరిస్థితులపై సర్వే చేపడితేనే కొంత సమగ్ర చిత్రం వస్తుంది. ఆస్తులు, సంపదల గురించి ప్రజలు పూర్తి సమాచారం వెల్లడించరు. అందుకే అది పరిమిత చిత్రంగానే ఉంటుంది. ఈ పరిమితి ఉన్నా బిహార్‌లో చేపట్టిన కుల సర్వేలోనే కొన్ని అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. వాటిని బహిరంగపరచారు. మిగతా సర్వేల విషయంలో అదీ జరగటం లేదు. తెలంగాణలో చేపట్టిన సర్వేలో తేలిన కీలక విషయాలను ఇప్పటికీ వెల్లడించలేదు. కర్ణాటకలోనూ అదే చేశారు. రాజకీయంగా సున్నితమనుకున్న సమాచారాన్ని తొక్కిపట్టటం ఒక అలవాటుగా మారుతోంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యా సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను వర్గీకరించటానికి ఏర్పాటు చేసిన జస్టిస్ రోహిణీ కమిషన్ ఇచ్చిన నివేదికను బహిర్గతం చేయలేదు. అయిదున్నర ఏళ్లు కసరత్తుచేసి రూపొందించిన నివేదికను వెల్లడించటానికి రాజకీయ అవసరం ఇంకా రాలేదు. అనధికారికంగా వెల్లడైన సమాచారం ప్రకారం కేంద్ర జాబితాలో 2,633 బీసీ కులాలు ఉంటే అందులో కేవలం 40 కులాలు.. మొత్తం రిజర్వేషన్లలో 50 శాతాన్ని దక్కించుకున్నాయి. 994 కులాలు ఒక్క ఉద్యోగాన్నీ, ఒక్క విద్యా సీటునూ పొందలేదు. 1400 కులాలకు 1 శాతం కంటే తక్కువ ప్రాతినిధ్యం లభించింది. బిహార్ కులసర్వేలో వెల్లడైన విషయాలను పరిశీలించినా తేలేది అదే. అక్కడ ప్రభుత్వ ఉద్యోగాలు 20,49,370 ఉంటే 6,21,481 ఉద్యోగాల్లో ఓబీసీలు (జనాభాలో 27శాతం) ఉన్నారు. ఓబీసీల కంటే జనాభాలో ఎక్కువ ఉన్న ఈబీసీలకు (36శాతం) 4,61,725 ఉద్యోగాలు మాత్రమే దక్కాయి. మొత్తంగా చూస్తే బీసీలకు ఉద్యోగాల్లో 52శాతం వరకూ ప్రాతినిధ్యం లభించినా విడివిడి కులాల పరంగా లెక్కిస్తే నాలుగైదు కులాల ఆధిపత్యమే కనపడుతుంది.

# పిజిఆర్ఎస్‌కు 206 వినతులు

### - సత్వరమే పరిష్కరించాలని జెసి ఆదేశం





**విజయనగరం, (రాజధాని వార్తలు):** కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 206 వినతులు అందాయి. ఎప్పటిలాగే అత్యధికంగా రెవెన్యూకి సంబంధించి 94 వినతులు అందగా, డిఆర్‌డిఏకి సంబంధించి 24, సచివాలయ సేవలకు సంబంధించి 14, పంచాయితీలకు సంబంధించి 12, ఇతర శాఖలకు మిగిలిన వినతులు అందాయి. జాయింట్ కలెక్టర్ ఎస్.సేధుమాదవన్, డిఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు ప్రజలవద్దనుంచి వినతులను స్వీకరించారు.

**నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలి : జెసి**

పిజిఆర్ఎస్‌కు వచ్చే వినతులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ అధికారులను ఆదేశించారు. పిజిఆర్ఎస్ కార్యక్రమంపై కలెక్టరేట్ ఆడిటోరియంలో సమీక్షించారు. ఆయా శాఖాలవారీగ పెండింగ్‌లో ఉన్న వినతులపై ఆరా తీశారు. పెండింగ్‌కు కారణాలను తెలుసుకున్నారు.

గతంతో పోలిస్తే పెండింగ్ వినతులు సంఖ్య బాగా తగ్గిందని అన్నారు. వారం వారం వచ్చే వినతులను నిర్ణీత కాలవ్య వధిలోగా పరిష్కరించాలని ఆదేశించారు. లబ్దిదారులు సంపూర్ణంగా సంతృప్తి చెందే విధంగా వాటిని పరిష్కరించాలని జెసి సేధుమాధవన్ సూచించారు.

# క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి : రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

### - ఉత్సాహంగా ప్రారంభమైన అండర్ - 17 బాలికల ఖోఖో పోటీలు






**విజయనగరం, (రాజధాని వార్తలు):** గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని రాష్ట్ర ఎంఎస్ఎమ్ఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 17 బాలికల రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలను ఆదివారం సాయంత్రం స్థానిక విజ్జి మైదానంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖోఖో క్రీడలో విజయనగరం జిల్లాకు ఎంతో పేరు ప్రఖ్యాతి ఉందని అన్నారు. జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీలు జరగడం పట్ల ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుతం బాలికలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని, ఈ తరుణంలో బాలికలు పోటీలను ఇక్కడ నిర్వహించడం జిల్లాకు గర్వ కారణమని పేర్కొన్నారు. క్రీడా స్ఫూర్తితో ఆడి విజయం సాధించాలని.కోరారు. అనంతరం పావురాలను ఎగురవేసి, క్రీడా పోటీలను ప్రారంభించారు. మొట్టమొదట విజయనగరం - గుంటూరు జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌కి టాస్ వేసి ఆటను ప్రారంబించారు.



కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఏపిసి రామారావు, డి ఎస్ డి ఓ ఎస్. వెంకటేశ్వరరావు, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మిలు, మండల విద్యా శాఖ అధికారి సత్యవతి, 13 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేడుకగా సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు

### - ఆధ్యాత్మికతతో నిండిపోయిన గజపతినగరం





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శతజయంతి వేడుకలు ఆదివారం గజపతినగరం సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో కన్నుల పండుగగా జరిగాయి. తెల్లవారుజామున 5 గంటలకు ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తనతో శత వర్ష జన్మదిన వేడుకలు ప్రారంభమయ్యాయి. ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక జ్యోతి ప్రజ్వలన చేయగా, ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు చేతుల మీదుగా పుష్పాలంకరణ, అలంకరణ అనంతరం బాబాకు కేక్ కట్ చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. సత్యసాయి పథకావిష్కరణ, గోపూజ, రుద్రాభిషేకం కార్యక్రమాలు చేపట్టిన అనంతరం మహానగర సంకీర్తన పేరిట సాయిబాబా చిత్రపటంతో కూడిన రథంపై గజపతినగరం, పురిటిపెంట పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. అలాగే మధ్యాహ్నం సుమారు 5000 మందికి ఆరిశెట్టి ప్రసాదు, బుడ్డెపు శ్రీను సహకారంతో మహా నారాయణ సేవ పేరిట అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం నిరుపేద నారాయణలకు అమృత కలశాలు (నిత్యవసర సరుకులతో కూడిన) పంపిణీ చేశారు.

అనంతరం బాలవికాస్ పిల్లలతో చేపట్టిన సాంస్కృతి కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. దివ్య మంగళ హారతి, ఉయ్యాల ఉత్సవంతో బాబా శతజయంతి ఉత్సవ వేడుకలు ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఉమ్మిడాల వెంకటేష్, మాజీ కన్వీనర్లు పొట్టా శ్రీనివాసరావు, మానాపురం సత్యరావు, తుమ్మలగుంటి పవన్, గిరిబాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను మోసగించకండి

### - జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా మోసగిస్తుందని వైకాపా జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మంత్రి అప్పలనాయుడు విమర్శించారు. సోమవారం స్థానిక వైకాపా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తప్పుడు నివేదికలతో రైతులను అన్యాయానికి గురి చేస్తున్నారన్నారు. అలాగే తమ ప్రభుత్వ హయాంలో సెంటు భూమి ఉన్న వారికి కూడా రైతు భరోసా చెల్లించామని, కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ చెల్లింపుల్లో కఠినమైన నిబంధనలు పెట్టి రైతులకు అన్యాయం చేస్తుందన్నారు. యూరియా పంపిణీలో కూడా రైతన్నలను అష్ట కష్టాలకు గురి చేసిందన్నారు. యూరియా ఎక్కువ వాడితే క్యాన్సర్ వస్తుందంటూ కుంటి సాకులు చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ, జడ్పిటిసిలు గార తవుడు, రౌతు రాజేశ్వరి, ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, బెల్లాన త్రినాధరావు, వైస్ ఎంపీపీ రమేష్ నాయుడు, కడుబండి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సహాయక చేతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం





**ఎటపాక, (రాజధాని వార్తలు):** ఎటపాక మండలం, చిమిలి వాగు గ్రామంలో గిరిజన సహాయక చేతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి కుంజా అర్జున్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కోశాధికారి మొల సతీష్, ప్రధాన కార్యదర్శి మడివి సంజులు మాట్లాడుతూ ట్రైబల్ హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పౌండ్ షన్ యొక్క ప్రధాన కార్యక్రమాలు నిర్వహిస్తామని అందులో బాగంగా రక్తదానం చేయటం, విద్యాదానం చేయటం, ఆపదలో ఉన్న నిరుపేదలకు చిరు సహాయం చేయటం, పర్యావరణ పరిరక్షణ కృషి చేయటం పేదలకు అన్నదానం చేయటం జరుగుతుందని గ్రామస్తులకు వివరించడం జరిగింది. ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు 200 మందికి అన్నదానం చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పద్దం శేఖర్, సొడి రాజారావు పెనుబల్లి దుర్గ రావు, వినోద్, వాసం గణేష్, వినోద్ కుమార్, కుంజా వెంకటేష్ మరియు గ్రామస్తులు, గ్రామ పెద్దలు పద్దంచిన్న జోగయ్య, మడకం రమేష్, మడివి దేవా, పెద్దమ్మ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాకినాడలో లక్ష్మీ షాపింగ్ మాల్ ప్రారంభం

**కాకినాడ, (రాజధాని వార్తలు):** నగరంలోని మెయిన్ రోడ్‌లో నూతనంగా నిర్మించిన లక్ష్మీ షాపింగ్ మాల్‌ను సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండ బాబు సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ నగరంలో వ్యాపార రంగం విస్తరిస్తోందని, ఆధునిక వాణిజ్య సౌకర్యాలతో కొత్త షాపింగ్ మాల్ ప్రారంభం నగర అభివృద్ధికి దోహదం చేస్తుందని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ సినీనటి అనసూయ, సినీ కామెడియన్ ఆది మరియు ఇటీవల విడుదలైన ఓజీ సినిమా హీరోయిన్ ప్రియాంక మోహన్ ప్రత్యేక అతిథులుగా హాజరై ఆకర్షణీయంగా నిలిచారు. అభిమానులు, నగర వాసులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సినీ తారలతో ఫోటోలు దిగారు.

అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో ఎమ్మెల్యే కొండబాబు మాట్లా డుతూ వ్యాపార అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. నగర ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి వ్యాపార వేత్తలు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహ కులు, స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

# బిగ్ సర్ ప్రైజ్....పాన్ ఇండియా సినిమాల్లో మహేష్ మేనల్లుడు!



టాలీవుడ్‌లో వారసుల ఎంట్రీ అంటే ఎప్పుడూ ఒక స్పెషల్ క్రేజ్ ఉంటుంది. తమ అభిమాన హీరో పోలికలతో ఉండే పిల్లలను స్క్రీన్ మీద చూడాలని ఫ్యాన్స్ ఆశపడటం సహజం. ఇప్పటికే ఘట్టమనేని ఫ్యామిలీ నుంచి మహేష్ బాబు ఇండస్ట్రీని ఏలుతుండగా, గౌతమ్ ఎంట్రీ కోసం వెయిటింగ్ నడుస్తోంది. కానీ ఈలోపే ఆ కాంపౌండ్ నుంచి మరో బాబు వెండితెర అరంగేట్రం చేయడానికి రెడీ అయ్యాడు. అది కూడా మామూలు సినిమాలతో కాదు. ఈ బుడతడు సోషల్ మీడియాలో ఇప్పటికే ఫుల్ ఫేమస్. అతను మరెవరో కాదు సుధీర్ బాబు చిన్నకొడుకు దర్శన్. ఇప్పటికే తన డ్యాన్స్ వీడియోలతో నెటిజన్లను ఆకట్టుకున్నాడు. మేనమామ మహేష్ బాబు పోలికలతో ఉంటూ, తండ్రి సుధీర్ బాబు లాంటి ఈజ్‌తో కనిపించే ఆ కుర్రాడు ఇప్పుడు ఏకంగా పాన్ ఇండియా స్టార్స్ సినిమాల్లో ఛాన్స్ కొట్టేశాడు. ఆ రెండు సినిమాలు కూడా ఇప్పుడు ఇండస్ట్రీలో మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్స్ కావడం విశేషం. 'వారణాసి' అనే క్రేజీ ప్రాజెక్ట్‌లో దర్శన్ నటించబోతున్నాడని టాక్ వస్తోంది. ఇందులో ఏకంగా సూపర్ స్టార్ మహేష్ బాబు చిన్నప్పటి పాత్రలో దర్శన్ కనిపించనున్నాడట. ప్రస్తుతం దీనికి సంబంధించిన షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో శరవేగంగా జరుగుతోంది. మేనమామ చిన్నప్పటి రోల్‌లో మేనల్లుడు కనిపించడం ఫ్యాన్స్‌కు పండగలాంటి వార్త. కేవలం మహేష్ బాబు సినిమాలోనే కాదు.. డార్లింగ్ ప్రభాస్ సినిమాలో కూడా దర్శన్‌కు ఛాన్స్ దక్కిందని తెలుస్తోంది. హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'లో కూడా దర్శన్ కనిపించనున్నట్లు టాక్ వస్తోంది. ఒకేసారి ఇటు మహేష్ బాబు పాత్రలో, అటు ప్రభాస్ సినిమాలో అవకాశాలు రావడం అంటే దర్శన్ లక్కీ అనే చెప్పాలి.

దర్శన్‌కు కెమెరా కొత్తేమీ కాదు. ఇన్నాళ్లు సుధీర్ బాబు తన సోషల్ మీడియా ఖాతాల్లో దర్శన్ చేసే విన్యాసాలను పోస్ట్ చేస్తూనే ఉన్నారు. ఆ వీడియోలకు విపరీతమైన లైకులు, కామెంట్స్ వచ్చేవి. ఇప్పుడు అదే కాన్ఫిడెన్స్‌తో వెండితెరపై సత్తా చాటడానికి వస్తున్నాడు. మహేష్ బాబు చైల్డ్ ఆర్టిస్ట్‌గా చేసి స్టార్ అయినట్టే, దర్శన్ కూడా అదే బాటలో వెళ్తున్నాడు. మొత్తానికి ఘట్టమనేని ఫ్యామిలీ నుంచి ఇప్పుడు ఈ బుడ్డోడు కూడా ఇండస్ట్రీలో అడుగు పెట్టేశాడు. చిన్నప్పుడే ఇలాంటి భారీ ప్రాజెక్టులతో కెరీర్ మొదలుపెడుతున్నాడంటే, భవిష్యత్తులో స్టార్ హీరో అయ్యే ఛాన్సులు గట్టిగానే ఉన్నాయి. ఈ రెండు సినిమాల్లో దర్శన్ నటన ఎలా ఉంటుందో, ఆడియన్స్‌ను ఎలా మెప్పిస్తాడో చూడాలి మరి.

# సెన్సార్ టాక్ వచ్చేసింది.. రామ్ ఖాతాలో బ్లాక్ బస్టర్ పడ్డట్టేనా?



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని నుంచి సినిమా వస్తుందంటే ఆ కిక్కే వేరు. కానీ ఈసారి రామ్ కేవలం ఎంటర్టైన్మెంట్ మాత్రమే కాదు, గుండెల్ని పిండేసే ఎమోషన్‌తో వస్తున్నాడు. పాటలు, ట్రైలర్‌తో ఇప్పటికే హైప్ క్రియేట్ చేసిన 'ఆంధ్ర కింగ్ తాలూకా' ఇప్పుడు రిలీజ్‌కు రెడీ అయింది. తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా గురించి బయటకు వచ్చిన రిపోర్ట్ చూస్తుంటే, ఫ్యాన్స్ కాలర్ ఎగరేసుకోవడం ఖాయం అనిపిస్తోంది. లేటెస్ట్‌గా అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమాకు U/A సర్టిఫికెట్ లభించింది. ఇక రన్ టైమ్ విషయానికి వస్తే, యాడ్స్ లేకుండా సినిమా 2 గంటల 35 నిమిషాల నిడివితో లాక్ చేశారు. మరీ ఎక్కువ కాకుండా, మరీ తక్కువ కాకుండా పర్ఫెక్ట్ రన్ టైమ్‌తో వస్తున్నారు. అయితే అసలు విషయం రన్ టైమ్‌లో లేదు, కంటెంట్‌లో ఉంది. సెన్సార్ రిపోర్ట్ ప్రకారం రామ్ పోతినేని వన్ మ్యాన్ షో అని తెలుస్తోంది. ఆయన నటన సినిమాకు ప్రధాన ఆస్తిగా నిలవనుందట. రెగ్యులర్ కమర్షియల్ సినిమాల్లా కాకుండా, కథ చాలా ఫ్రెష్‌గా, కొత్తగా ఉందని టాక్. ఒక సినిమా స్టార్‌కు, అతని అభిమానికి మధ్య ఉండే ఎమోషనల్ బాండింగ్‌ను దర్శకుడు మహేశ్ బాబు పి చాలా ఆర్గానిక్‌గా, అద్భుతంగా చూపించారని ప్రశంసిస్తున్నారు. ముఖ్యంగా సినిమాలోని చివరి 45 నిమిషాలు అదిరిపోతుందని చెబుతున్నారు. క్లైమాక్స్ ఎపిసోడ్స్ ఇంతకు ముందెన్నడూ చూడని విధంగా డిజైన్ చేశారట. ఆ ఎమోషనల్ కోర్ ఆడియన్స్‌ను కచ్చితంగా కంటతడి పెట్టిస్తుందని అంటున్నారు. కన్నడ స్టార్ ఉపేంద్ర క్లైమాక్స్‌లో వచ్చే సీన్స్ గూస్ బంప్స్ తెప్పిస్తాయని, సినిమాకు ఇవే హైలైట్‌గా నిలుస్తాయని స్ట్రాంగ్‌గా వినిపిస్తోంది. ఇక రామ్, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే మధ్య కెమిస్ట్రీ కూడా బాగా వర్కవుట్ అయిందట. అలాగే తండ్రి పాత్రలో రావు రమేష్, రామ్ మధ్య వచ్చే సన్నివేశాలు మనసుకు హత్తుకునేలా ఉంటాయని సమాచారం. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువలు సినిమాను విజువల్ గా చాలా గ్రాండ్‌గా చూపించాయని తెలుస్తోంది. ప్రతి ఫ్రేమ్‌లోనూ క్వాలిటీ కనిపిస్తోందని సెన్సార్ సభ్యుల నుంచి టాక్ వస్తోంది. సెన్సార్ టాక్ అయితే పాజిటివ్‌గానే కాదు, బ్లాక్ బస్టర్ వైబ్స్ ఇస్తోంది.

రిపోర్ట్స్ పాజిటివ్‌గా వస్తుండటంతో అంచనాలు పీక్స్‌కు వెళ్లాయి. నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ అవుతున్న ఈ 'ఆంధ్ర కింగ్ తాలూకా', బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలి. ఫైనల్‌గా రామ్ ఈసారి గట్టిగానే కొట్టేలా ఉన్నాడు.

# ఆ స్టార్ హీరో ఈసారి పాత పద్ధతిలోనా?



కోలీవుడ్ స్టార్ సూర్య సరైన సక్సస్ అందుకుని చాలా కాలమవుతోంది. జైభీమ్ తర్వాత సరైన సక్సెస్ ఒక్కటీ పడలేదు. జైభీమ్ కూడా ఓటీటీ రిలీజ్ కావడంతో థియేట్రికల్‌గా ఆడియన్స్ దూరంగానే కనిపించింది. కానీ ఆ సినిమాతో సూర్యకు వచ్చిన గుర్తింపు మాత్రం ఎంతో ప్రత్యేకమైనది. ఆ తర్వాత వరుసగా రిలీజ్ అయిన నాలుగైదు సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. ప్రత్యేకించి ఆ సినిమా రిలీజ్‌లు కూడా అన్నీ తమిళ టైటిల్స్‌తో తెలుగులో రిలీజ్ అయ్యాయి. టైటిల్ మార్చాల్సిన ఆవశ్యకత లేకపోవడంతో అదే టైటిల్‌తో ఏక కాలంలో రిలీజ్ చేసారు. ఈటీ, కంగువ, రెట్రోలాంటి చిత్రాల టైటిల్స్‌లో ఎలాంటి మార్పు కనిపించలేదు. ఈ నేపథ్యంలో తెలుగు టైటిల్ లేకుండా తమిళ సినిమా రిలీజ్ ఏంటనే విమర్శలు వ్యక్తమయ్యయాయి. అంతకుముందు మరికొంత మంది హీరోలు నటించిన సినిమాలు కూడా ఇలాగే రిలీజ్ అయ్యాయి. దీంతో టాలీవుడ్ నుంచి కాస్త నెగివిటీ కూడా మొదలైంది. కానీ తెలుగు అభిమానులంటే సూర్య ఎంతో గౌరవిస్తారు. ఆయన్ని ఇక్కడ ఆడియన్స్ ఎంతో ఆదరిస్తారు. తమిళ అభిమానుల కంటే తనకు ఓ మెట్టు పైనే తెలుగు అభిమానులుంటారు. సూర్య లాగే కార్తీ కూడా ఇక్కడ అభిమానులకు అంతే ప్రాధాన్యత ఇస్తారు. తమిళ నుంచి ఎంత మంది హీరోలున్నా? అన్నదమ్ములిద్దరు మాత్రం తెలుగు ఆడియన్స్‌కు ఎంతో ప్రత్యేకం. ఆ సంగతి పక్కన బెడితే తదుపరి సినిమా రిలీజ్ విషయంలో సూర్య సంచలన నిర్ణయానికి అవకాశం ఉందా? అంటే ఉందనే చప్పొచ్చు. సూర్య నటించిన కరుప్పు సంక్రాంతి సందర్భంగా రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ ఆ సీజన్‌లో తమిళ సహా తెలుగు నుంచి చాలా సినిమాలు రిలీజ్ కు ఉండటంతో సూర్య ఉన్న తాజా పరిస్థితుల్లో వాళ్లకు పోటీగా రావడం కంటే పోటీ లేని సమయంలోనే వస్తే బాగుంటుంది అన్న ఆలోచనతో వెనక్కి తగ్గినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా జనవరి 26 కరుప్పును రిలీజ్ చేయాలని ప్లాన్ చేసుకుంటున్నారుట.

అయితే ఈ సినిమాకు తెలు గులో టైటిల్ ఉండాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది. సూర్య గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తెలుగు అభిమానుల కోసం తెలుగు టైటిల్‌తో రావాలని ఆశీస్తున్నారు. అందుకు సూర్య ఎంత మాత్రం అడ్డు చెప్పే నటుడు కాదు. గత సినిమాల వైఫల్యం నేపథ్యంలో ఈసారి తెలుగు టైటిల్ తోనే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మధ్యలో దర్శక, నిర్మాతలు మాతృభాషపై అతి మమకారంతో ఎలాంటి రాజకీయాలకు పాల్పడకుండా ఉంటే సాధ్యమే.

# వారణాసి కోసం జక్కన్న ప్రతీదీ చాలా ప్లాన్డ్‌గా!



దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా రూపొందుతున్న సినిమా వారణాసి. ఎస్ఎస్ఎంబీ29 గా వస్తోన్న ఈ సినిమాపై ముందు నుంచే భారీ అంచనాలుండగా, జక్కన్న వారణాసిని పాన్ వరల్డ్ లెవెల్‌లో రూపొందిస్తున్నారు. రీసెంట్‌గా ఓ భారీ ఈవెంట్‌ను ఏర్పాటు చేసి అందులో చిత్ర టైటిల్‌తో పాటూ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేసి సినిమాపై విపరీతమైన హైప్‌ను క్రియేట్ చేశారు మేకర్స్. వారణాసిలో మహేష్‌కు జోడీగా బాలీవుడ్ స్టార్, గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా మందాకినిగా కనిపించనుండగా, మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కుంభ పాత్రలో విలన్ గా నటించనున్నారు. అయితే జక్కన్న మొదటి నుంచి తన సినిమాల్లో కీలక పాత్రలన్నింటికీ స్టార్లనే తీసుకుంటారనే విషయం తెలిసిందే. అందులో భాగంగానే ఈ మూవీలో హనుమంతుడి పాత్రలో ఓ స్టార్ హీరో కనిపించనున్నారని వార్తలొస్తున్నాయి. అయితే రాజమౌళి ఈ సినిమా షూటింగ్‌ను తన గత సినిమాల్లాగా కాకుండా ఎంతో వేగంగా పూర్తి చేస్తున్నారని తెలుస్తోంది. షూటింగ్‌ను చాలా త్వరగా పూర్తి చేస్తున్నారు కాబట్టే సినిమాను 2027 సమ్మర్‌కు రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారనే టాక్ కూడా వినిపిస్తోంది. ఇప్పటికే పలు షెడ్యూళ్ల షూటింగ్‌ను పూర్తి చేసుకున్న వారణాసి షూటింగ్‌పై ఇప్పుడో క్రేజీ అప్డేట్ తెలుస్తోంది. వారణాసి షూటింగ్ శరవేగంగా జరుగుతుందని, ప్రస్తుతం సినిమాలో మహేష్ బాబు చిన్నప్పటి సీన్స్‌ను మేకర్స్ తెరకెక్కిస్తున్నారని సమాచారం.

ఈ చైల్డ్‌హుడ్ సీన్స్ సినిమాలో చాలా కీలకంగా ఉండనున్నాయని, నిమిషం కనిపించే సీన్‌ను అయినా ఎంతో జాగ్రత్తగా తెరకెక్కించే రాజమౌళి, ఈ సీన్స్‌ను మరింత పకడ్బందీగా తెరకెక్కిస్తున్నారని యూనిట్ సభ్యులంటున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సినిమాను కె.ఎల్ నారాయణ, ఎస్.ఎస్ కార్తికేయ నిర్మిస్తుండగా, ఆస్కార్ విజేత ఎం.ఎం కీరవాణి వారణాసికి సంగీతాన్ని సమకూరుస్తున్నారు.

# ఘనంగా ముస్కాన్ లక్కీ ఫ్యాషన్స్ ప్రారంభం





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని గాంధీనగర్ హై స్కూల్ వద్ద నూతనంగా ముస్కాన్ లక్కీ ఫ్యాషన్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన వ్యాపారం బాగా జరగాలని ఆకాంక్షించారు. అనంతరం రెండు బీరువాలు బహుమతిగా అందజేశారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. టిడిపి నాయకులు చెంచయ్య, జిలాని, షాపు నిర్వాహకుడు జావిద్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల అను దృష్టిలో ఉంచుకొని అన్ని రకాల వస్త్రాలను అందుబాటులో తీసుకుని వచ్చామని ముస్కాన్ లక్కీ ఫ్యాషన్స్ ఆదరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ రాజా నాయుడు, కార్పొరేటర్ అవినాష్, కో క్లస్టర్ ఇంచార్జ్ టీ. మమతారెడ్డి, రాష్ట్ర బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గంగాధర్, డివిజన్ అధ్యక్షుడు గుద్దేటి చెంచయ్య, జిలాని, అస్లాం, దస్తగిరి, దావూద్, ఖాదర్, ఖాదర్బాషా ఆరిఫ్, అంజాద్, రహంతుల్లా, ఫైరోజ్, ఖమురుద్దీన్, మస్తానమ్మ, పి.దేవి తదితరులు పాల్గొన్నారు.

# అటవీ సంపదను అదాని, అంబానీలకు దోచిపెట్టడానికే ఆపరేషన్ కగార్ పేరుతో మోడీ, అమిత్ షాలు చేయిస్తున్న ఎన్‌కౌంటర్లు

**- శాంతి చర్చలకి వచ్చిన మావోయిస్టులను చంపడం దుర్మార్గం - మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ల పై న్యాయ విచారణ జరపాలి - సిపిఐ డిమాండ్ - భూటకపు ఎన్‌కౌంటర్ల నిరసన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. కామేశ్వరరావు**

**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రభుత్వంతో శాంతి చర్చలు జరపాలనే ఉద్దేశంతో వచ్చిన మావోయిస్టు నేతలను ఆసుపత్రి నుండి తీసుకెళ్ళి ఎన్‌కౌంటర్ పేరిట చంపటం దుర్మార్గమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. కామేశ్వరరావు ధ్వజమెత్తారు. అల్లూరి జిల్లా మారేడుమిల్లి ఏజన్సీలో జరిగిన ఎన్‌కౌంటర్ల పై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ, భూటకపు ఎన్కౌం టర్లకు నిరసనగా రాష్ట్ర వ్యాపితంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా విజయనగరం నియోజకవర్గ కార్యదర్శి బుగత అశోక్ నేతృత్వంలో ఆదివారం ఉదయం స్థానిక అంబెడ్కర్ జంక్షన్లో అంబేద్కర్ విగ్రహం ముందు జరిగిన నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. కామేశ్వరరావు మీడియాలో మాట్లాడుతూ మారేడుమిల్లి ఏజన్సీలో మావోయిస్టు అగ్రనేత హిడ్మాతో పాటు 13 మంది మావోయిస్టులు మరణించారని పోలీసులు ప్రకటించిన విషయం గుర్తు చేశారు. అయితే చికిత్స కోసం నగరాలకు వచ్చి తలదాచుకున్న మావో యిస్టులను పట్టుకుని అడవుల్లోకి తీసుకెళ్లి ఎదురుకాల్పుల పేరిట పోలీసులు కాల్చి చంపడం దుర్మార్గమని విమర్శించారు. విజ యవాడ, ఏలూరు, ఇతర ప్రాంతాలలో నిర్బంధించిన మావోయి స్టులను, అమాయక గిరిజనులను వెంటనే న్యాయస్థానాల ముందు హాజరు పరచాలని డిమాండ్ చేశారు. 2026 మార్చి 31 కి మావోయిస్టు రహిత ప్రాంతంగా మారుస్తామని, ఆపరేషన్ కగార్‌లో అంతర్భాగంగా మోడీ, అమిత్ షాలు నరమేధానికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులను భయాం దోళనకు గురి చేసి అడవుల నుంచి ఖాళీ చేయించి అటవీ సం పదను అదాని, అంబానీలకు దోచిపెట్టడానికే ఆపరేషన్ కగార్




పేరుతో మోడీ, అమిత్షాలు చేయిస్తున్న భూటకపు ఎన్‌కౌంటర్లు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రంపు చెప్పగానే శత్రు దేశమైన ఆపరేషన్ సింధూర్ ఆపేసిన మోడీషాలకు మావోయిస్టులు ఎన్నో ఏళ్ళ నుంచి శాంతి చర్చలు కోరుకుంటున్న కూడా మీకు వినప డలేదా అని మండిపడ్డారు. ఇప్పటికైనా మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపించి ఈ భూటకపు ఎన్‌కౌంటర్లను ఆపాలని, మారే డుమిల్లి భూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలని సిపిఐ డిమాండ్ చేస్తుందని తెలిపారు. సిపిఐ విజయనగరం నియోజకవర్గ కార్యదర్శి బుగత అశోక్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో సమితి సభ్యులు పొందూరు అప్పలరాజు, వడ్డాది కొండలరావు, ఎ.ఐ.ఎస్.ఎఫ్ గౌరీ శంకర్, ఎ.ఐ.వై.ఎఫ్ బూర వాసు, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ సయ్యద్ ఇబ్రహీం, అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అండ్ కస్టమర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఇ.వి.నాయుడు, జిల్లా అధ్యక్షులు మజ్జి సూరప్పడు మరియు కార్మికులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే "రైతన్న మీ కోసం" లక్ష్యం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** రైతుల సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారని సామర్లకోట వ్యవసాయ కమిటీ ఛైర్పర్సన్ అందుగుల మణికుమారి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఉప్పు వారి వ్యవసాయ పొలాల ప్రాంతంలో ప్రాంతంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా రైతులందరితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా సామర్ల కోట వ్యవసాయ కమిటీ ఛైర్పర్సన్ అందుగుల మణి కుమారి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు సంక్షేమ లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో శ్రమిస్తూ కృషి చేస్తున్నారన్నారు. వ్యవసాయ మార్కెటింగ్ ద్వారా అనేక రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో ఈనెల 29 వరకు అనేక ప్రాంతాల్లో రైతన్న మీకోసం సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అందుగుల జార్జ్ చక్రవర్తి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భవనారాయణ వీఆర్వో నల్లజర్ల మురళికృష్ణ, వీ ఏ ఏ సుజాత రైతులు పాల్గొన్నారు.

# జాతీయ టేబుల్ టెన్నిస్‌కు శ్రీప్రకాష్ విద్యార్థులు ఎంపిక

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం శ్రీ ప్రకాష్ సినర్జీ విద్యార్థులు జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఆంధ్ర ప్రదేశ్ తరపున ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం పాఠశాల డైరెక్టర్ సి హెచ్ విజయ ప్రకాష్ తెలుపుతూ ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు 3 రోజుల పాటు విశాఖపట్టణం గీతం కాలేజీలో జరిగిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో పాల్గొన్న తమ విద్యార్థులు 15 రజత పతకాలు సాధించారన్నారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బాలికల టీమ్ విభాగంలో మొపర్ణా దాస్, టి.సుదీక్ష, ఎమ్.శాంతి జ్యోతి, డి గీతాంజలిలు అర్హత సాధించి జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరపున ఎంపికైనట్టు ఆయన తెలిపారు. కాగా జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లను వేణు, శ్రీరామ్, సుబ్రహ్మ ణ్యం అభినందించారు. అలాగే విద్యార్థులకు



ఎంతో ప్రోత్సాహం అందించిన విద్యార్థుల తల్లిదండ్రులను శ్రీ ప్రకాష్ సినర్జీ అకాడమీ డైరెక్టర్ సిహెచ్ విజయ్ ప్రకాష్ అభినందించారు.

# నెల్లూరులో ఘనంగా వెన్నెల కంటి రాఘవయ్య 44వ వర్ధంతి









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్లో ఆంధ్ర రాష్ట్ర ఆదిమ జాతి సేవ సంఘం ట్రస్ట్ బోర్డు మేనేజింగ్ ట్రస్ట్ పిఎల్ ప్రసాద్ ఆధ్వర్యంలో వెన్నెల కంటి రాఘవయ్య 44వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెన్నెల కంటి రాఘవయ్య విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పిఎల్ ప్రసాద్ మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం వెన్నెలకంటి రాఘవయ్య తన చివరి శ్వాస వరకు నిరంతరం శ్రమించార న్నారు. అనాథులైన యానాదుల కోసం ఆయన చేసిన పోరాటాలు చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోయాయన్నారు. 1930లో ఉప్పు సత్యాగ్రహం నడిపినందుకు రాఘవయ్య జైలు జీవితాన్ని కూడా అనుభవించారన్నారు. వెన్నెలకంటి రాఘవయ్య ఆశయా లను నేటి యువత నాయకులు ముందుకు తీసుకుని వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు రాజేశ్వరమ్మ, పి లావణ్య, గందళ్ళ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# "రైతన్న.. మీకోసం" మరో మోసం : కాకాణి









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** చంద్రబాబు ప్రకటించిన "రైతన్న మీకోసం" కార్యక్రమంలో, గ్రామంలో పర్యటిస్తున్న కూటమి నాయకులకు "రావద్దు అన్న" అంటూ ముఖం చాటేస్తున్న రైతులు. రైతులను అన్ని విధాలా ముంచిన కూటమి ప్రభుత్వం, సినిమా టైటిల్స్ పేరిట మరో ప్రచార ఆర్భాటం. సర్వేపల్లి నియోజకవ ర్గంలోని వెంకటాచలం మండల కేంద్రంతో పాటు, తోటపల్లి గూడూరు మండలం ఈదూరు, మాచర్లవారిపాళెం గ్రామాలలో పర్యటించిన మాజీ మంత్రివర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. రైతులకు సరిపడ యూరియా అందక, నకిలీ విత్తనాల బెడదతో సతమతమవుతున్నారు. చంద్రబాబు రైతులకు రెండేళ్లలో 40 వేలకు గాను, 10 వేలు ఇచ్చి, 30 వేలు ఎగ్గొట్టాడు. ఉచిత పంటల భీమాకు మంగళం పాడి, రైతులకు తీవ్ర ద్రోహం చేస్తున్నారు. ధరల స్థిరీకరణ నిధి లేక రైతులు పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధర రావడం లేదు. కూటమి ప్రభుత్వంలో ఖర్చులు పెరిగి ఆదాయం తగ్గడంతో, రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. విత్తనం నుండి విక్రయం వరకు రైతును చేయ్యిపట్టి నడిపించిన ఆర్బీకే వ్యవస్థను నిర్వీర్యం చేశారు. నాణ్యమైన విత్తనాలు దొరకక, కట్టా యూరియా కోసం రైతన్నల అగచాట్లు వర్ణనాతీతం. జిల్లాలో రైతన్న మీకోసం కార్యక్రమం ఎక్కడా రైతులు పాల్గొన్నక వెలవెలపోయింది. తెలుగుదేశం నాయకులే రైతుల వేషాల్లో కనబడటం తప్ప, అసలైన రైతులు ముఖం చాటేయడం, కూటమి పాలనలో రైతు వ్యతిరేక విధానా లకు నిదర్శనం. అన్నదాతలను నిండా ముంచి, రైతన్నల కోసమే నంటూ, చంద్రబాబు డ్రామాలు ఆడటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు. జగనన్న పాలనలో రైతులు సుభిక్షంగా, సంతోషంగా ఉండేవారు. వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు అన్నదాతల ప్రతి అడుగులో జగనన్న సహకారం మర్చిపోలేనిది. రైతన్నల శ్రేయస్సు కోసం జగనన్న అనేక నిర్ణయాలు తీసుకొని, అన్ని విధాలా అండగా నిలిచాడు. అన్నదాతలు కూటమి ప్రభు త్వాన్ని ప్రాలదోలి, జగనన్న రైతు ప్రభుత్వం తిరిగి రావాలని కోరుకుంటున్నారు.

చంద్రబాబు ఇకనైనా, డ్రామాలు మాని, వ్యవసాయాభివృద్ధి, రైతుల సంక్షేమం గురించి ఆలోచిస్తే మంచి దని హితవు చెబుతున్నాం. జగనన్న నాయకత్వంలో, ప్రభుత్వంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా, రైతులకు అండగా అన్నివేళలా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తోడుగా నిలుస్తుంది. ఈదూరు గ్రామంలో కోడూరు రామలింగారెడ్డి సతీమణి కోడూరు సుగు ణమ్మ ఇటీవల మృతి చెందడంతో కుటుంబసభ్యులను పరామ ర్శించిన మాజీ మంత్రి కాకాణి. ఇటీవల మృతి చెందిన వెంకటా చలంలో ఆలూరు మోహన్, మాచర్లవారిపాళెం గ్రామంలో ముసలి జస్వింత కుటుంబ సభ్యులను పరామర్శించిన కాకాణి.

# రేషన్ కార్డులలో పొరపాటులను త్వరలో సవరిస్తాం : జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి

**అమలాపురం, (రాజధాని వార్తలు):** ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన డిజిటల్ రేషన్ కార్డులలో జిల్లా పేరు తూర్పుగోదావరి జిల్లాగా ముద్రించటంతో జరిగిన పొరపాటును త్వరలోనే సవరణ చేస్తా మని జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి తెలిపారు. గౌరవ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పేరుకు బదులుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పేరు ముద్రిం చటం పట్ల ప్రజలలో ఉన్న మనోభావాలను జిల్లా యం త్రాంగం గుర్తించిందని జెసి నిశాంతి తెలిపారు. ప్రజల ఆలోచనలను పరిగణనలోకి తీసుకొని, జిల్లా రేషన్ కార్డులలో కొత్త జిల్లా పేరు "డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా"గా మార్చాలని కృషి చేశామన్నారు. ఈ విషయంపై రాష్ట్ర పౌరసరఫరాల ప్రధాన కార్యాలయంతో నిరంతరం సంప్రదింపులు జరిపి అన్ని రేషన్ కార్డుల్లో, ఇతర అధికారిక డాక్యుమెంట్లలో జిల్లా పేరు మార్పు సాధ్యమైందని అధికారికంగా తెలియజేస్తున్నామని ఆమె అన్నారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల రేషన్ కార్డులలో మార్పు ప్రక్రియకు కొంత సమయం పడుతుందని అప్పటి వరకు ప్రజలు సహనం పాటించాలని అన్నారు. ఈ మార్పును ఆన్‌లైన్ స్కానిం గ్‌లో ఐక్యంగా మార్చడం జరుగుతోందని అన్నారు. జిల్లా యం



త్రాంగం తీసుకున్న చొరవ పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆమె అన్నారు. ఇది జిల్లా యంత్రాంగం మరియు రాష్ట్ర పౌరసరఫరాల కార్యాలయం మధ్య సమ న్వయంతో సాధ్యమైందని తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవలను గౌరవిస్తూ జిల్లా ప్రజలు ఎటువంటి ఆందోళన చెందకుండా మార్పును గమనించి అందరూ సహకరించాలని జెసి నిశాంతి అన్నారు.

# రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకి ఎంపికైన ప్రణతి




**భద్రాచలం, (రాజధాని వార్తలు):** జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ప్రణతి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కిన్నెరసానిలో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. మండలస్థాయిలో ఎస్ జీఎఫ్ అండర్-14 బాలికల వాలీబాల్ పోటీలు ఆగస్టులో భద్రాచలంలో నిర్వహించారు. ఈ పోటీల్లో ఎంపికైన ప్రణతి ఇదే నెల చివరిలో భద్రాచలంలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపింది. ఈ ఏడాది సెప్టెంబరు నెలలో కొత్తగూడెంలో జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ఎంపికై సత్తా చాటింది. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన ప్రణితని మండల విద్య శాఖధికారి టీ.రమ, పి.డి.సుజాత, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

# ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు




**గజపతినగరం, (రాజధాని వార్తలు):** భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి సత్య సాయి మందిరం ఆవరణంలో బాలవికాస్ విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను శ్రోతలను విశేషంగా ఆకట్టుకున్నాయి. సత్య, ధర్మ, శాంతి, ప్రేమలను తెలియజేసే సందేశాత్మక నాటికలు, పలు ఆధ్యాత్మిక గేయాలకు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శ్రోతలు అత్యంత శ్రద్ధాశక్తులతో ఈ సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. అనంతరం మంగళహారతి, ఉయ్యాల ఉత్సవంతో వేడుకలు ముగిశాయి.

# గోదావరి ఇసుక ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ రవాణా

**బూర్గంపాడు, (రాజధాని వార్తలు):** నాగినేని ప్రోలు (రెడ్డిపాలెం) గొమ్మూరు గోదావరి ఇసుక ర్యాంపు నుండి ఎటువంటి అనుమతులు లేకుండా ఉదయం 8 గంటల నుండి సుమారు 10 ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక తూలకాలు నిర్వహిస్తున్నారంటూ నాగినేని ప్రోలు గ్రామస్తులు అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్నారు ఇట్టి విషయమై స్థానిక గ్రామస్తులు బూర్గంపాడు తాసిల్దార్‌ను ఇసుక తోలకాలపై వివరణ అడగగా గోదావరి నది నుండి ఇసుక తోలేటందుకు ఎటువంటి పర్మిషన్లు ఇవ్వలేదు అని గ్రామస్తులకు తెలియజేసినట్లు సమాచారం. వెంటనే రెవిన్యూ సిబ్బందిని గోమ్మూరు ర్యాంపు వద్దకు పంపించిన బూర్గంపాడు తాసిల్దార్ సంఘటన స్థలానికి చేరుకున్న



రెవెన్యూ సిబ్బంది పర్మిషన్ లేకుండా తోలుతున్నటువంటి ట్రాక్టర్లను తాసిల్దార్ కార్యాలయానికి తరలించాలని ట్రాక్టర్ డ్రైవర్లకు సూచించిన రెవెన్యూ సిబ్బంది.

# బాధితుడికి ఆర్థిక సాయం అందజేసిన వైస్సార్సీపీ నాయకులు కుంచే రమణారావు

**డాక్టర్ బి. ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం, (రాజధాని వార్తలు):** గోపవరంకు చెందిన కుంచే బాలాజీరావు కాలికి గాయమై ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద చికిత్స పొందుతున్నాడు. బాధితుడు బాలాజీ రావును ఆదివారం అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు పరామర్శించారు. బాధితుని వైద్యం నిమిత్తం రూ.10 వేలు చెక్కును బాలాజీకి రమణారావు అందజేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రమణారావుకు బాలాజీ అతని కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సాధనాల శ్రీను, నక్కా సంపత్ కుమార్, నేరేడుమిల్లి శ్రీను, గంటా లక్ష్మీ ప్రసాద్, కుంచే బాబులు, విష్ణు, శేఖర్, చినబాబు, తాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# కృష్ణ చైతన్య విద్యాసంస్థల సహ డైరెక్టర్ ఆర్ వి కృష్ణారెడ్డి అత్త మరణించడంతో కృష్ణారెడ్డిని పరామర్శించిన పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గం ఈదూరు గ్రామంలో తన గురువు కృష్ణ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ ఆర్ వి కృష్ణారెడ్డి అత్త మరణించడంతో ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఈదూరులోని వారి నివాసానికి వెళ్లి కృష్ణారెడ్డిని పరామర్శించడం జరిగింది. అనంతరం అక్కడకు విచ్చేసిన వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి కృష్ణా రెడ్డి మామ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# టిడిపిలోకి 50 కుటుంబాల చేరిక



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** నియోజకవర్గంలోని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్వగ్రామమైన గంట్యాడ గ్రామం నుంచి టిడిపిలోకి ఆదివారం భారీ చేరికలు జరిగాయి. ఈ గ్రామంలో వైకాపా పార్టీకి చెందిన 50 కుటుంబాలు ఆ పార్టీని వీడి, తెలుగుదేశం పార్టీలోకి చేరాయి. వీరందరికీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన దగ్గరనుంచి చేపడుతున్న విధానాలు, అమలు చేస్తున్న పథకాలు పట్ల ఆకర్షితులై టిడిపి తీర్థం పుచ్చుకుంటున్నట్లు ఈ సందర్భంగా ఆ కుటుంబాలు తెలిపాయి. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రోజురోజుకు తమ పార్టీకి ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని, ఈ ఆదరణ చూసి తట్టుకోలేక ప్రతిపక్ష వైకాపా నాయకులు దుష్ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# పేదరికం పోవాలంటే చదువు ఒక్కటే మార్గం : ఏజిఎం శ్రీకాంత్




**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** ప్రతి విద్యార్థి, విద్యార్థి దశలో ఇష్టంగా చదివితే పేదరికాన్ని ప్రారదోలుచని, సృజనాత్మకతను పెంపొందించుకోవాలని నాయుడుపేట శ్రీ చైతన్య హై స్కూల్ ఏజీఎం శ్రీకాంత్ సూచించారు. నాయుడుపేట పట్టణంలో ఉన్న శ్రీ చైతన్య విద్యార్థులకు నిర్వహించిన నాసా కాంటెస్ట్ నిర్వహణలో ఎంపికైన విద్యార్థులకు ఏటీఎం పర్యవేక్షణలో అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల లెక్చరర్ మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్య విజ్ఞాన రంగంలో పోటీ తత్వమున్న శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు 47 మంది నాసా కాంటెస్ట్ టెస్టులో ఎంపిక కావడం హర్షనీయమని విద్యార్థులను అభినందించారు. ఎంపిక కావడానికి అన్ని విధాల ప్రోత్సాహం అందించిన ప్రిన్సిపాల్ అంబటి రవీంద్ర గైడెన్స్ దోహద పడిందన్నారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులుగా టీ షర్ట్స్, జామెంట్రీ బాక్స్‌లు అందజేశారు.

# మాధవ పట్టణంలో రైతన్న... మీకోసం అవగాహన

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** "రైతన్న... మీకోసం" కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తున్న పంచ సూత్రాలపై రైతులకు అవగాహన కార్యక్రమం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప చేపట్టారు. సామర్లకోట మండలం మాధవ పట్టణం గ్రామంలో మండల వ్యవసాయాధికారి మురళీధర్ ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే చిన రాజప్ప ముఖ్య అతిధిగా విచ్చేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులకు లాభద్దాయకమైన పంటల కోసం రాష్ట్ర ప్రభుత్వం కొన్ని సూచనలు చేస్తోందన్నారు. అగ్రి టెక్, డిమాండ్ ఆధారిత పంటలను పండించడం, ఫుడ్ ప్రాసెసింగ్ పద్ధతులు, ప్రభుత్వం నుంచి మద్దతు ధర అందించడం వంటి అంశాలను పంచ సూత్రాలుగా ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నారు. కాగా వాటిని అనుసరించి రైతులు వారి వ్యవసాయ పద్ధతుల్లో మార్పులు చేసుకుంటూ ప్రకృతి విపత్తుల నుంచి బయట పడి, లాభదాయక వ్యవసాయాన్ని పొందాలని సూచించారు. కాగా పంచ సూత్రాలపై వ్యవసాయ సహాయ సంచాలకులు కె దుర్గాలక్ష్మి, మండల



వ్యవసాయాధికారి మురళీ ధర్ రైతులకు వివరించి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు నిమ్మకాయల రంగనాగ్, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే వెంకటేష్ బాబు, తెదేపా నాయకులు నూనే రామారావు, పంచాయితీ కార్యదర్శి టి సత్యనారాయణ, వివిఎ జి శ్రీలక్ష్మి దుర్గ, విఆర్వో నాగేశ్వర రావు, సాయిరెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ కాశీ, పెంకే రామకృష్ణ, పిల్లి శ్రీను, బూత్ ఇంచార్జిలు, రైతులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం అన్యాయం

## - మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి



**కొడవలూరు, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ వైద్యశాలలను ప్రవేట్ కర్ణ చేయడం దుర్మార్గమని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా మండల పరిధిలోని తాటాకుల దిన్నె గ్రామంలో కోటి సంతకాల కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాల గురించి ధ్వజమెత్తారు, వైకాపా ప్రభుత్వంలో పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను నెలకొల్పటం జరిగిందని, ఈరోజు తెలుగుదేశం ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరణ చేయడం పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల యొక్క ఎదుగుదలను, మనుగడను దెబ్బతీయడం జరుగుతుందని, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతుందని అందువల్లనే రాష్ట్రంలో కోటి సంతకాల స్వీకరణ జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసే పరిస్థితులతో ఈ ప్రభుత్వం ఉందని ప్రజలందరూ తెలుసుకోవాలని, ఈ కోటి సంతకాల స్వీకరణ అనంతరం ఈ సంతకాల పత్రాలను హైకమాండ్కు సమర్పించి, ప్రభుత్వాన్ని అభివృద్ధి పరిచే విధంగా మంచి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాజీ డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, గ్రామ సర్పంచ్ రంగారెడ్డి, మండల కన్వీనర్ శేషగిరి, జడ్పిటిసి గాలిజ్యోతి, వీరి సురేష్, పానేటి శ్రీకాంత్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు

## - టిడిపి మండల అధ్యక్షులు బాణా శ్రీనివాసులు రెడ్డి




**సంగం, (రాజధాని వార్తలు):** ప్రతి ఇంట్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు అందే విధంగా చూస్తున్నామని మండల టిడిపి అధ్యక్షులు బాణా శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంగం మండలం తరుణవాయి గ్రామంలో మండల వ్యవసాయాధికారి శశిధర్ రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ మండల అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి పాల్గొని రైతుల ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలియచేశారు. ముఖ్యమంత్రి పంపిన సందేశంలోని పంచసూత్రాలను రైతులకు వివరించారు. వ్యవసాయ శాఖ తరపున రైతులకు ఏమైనా అవసరాలు ఉన్నాయా అనే వివరాలను నమోదు చేసుకున్నారు. ఆరు రోజుల కార్యక్రమం పూర్తయిన తర్వాత, మూడవ తేదీన రైతు సేవా కేంద్రంలో గ్రామ సభ నిర్వహిస్తామని తెలిపారు. రాబోయే మూడు సీజన్ల కోసం సమగ్రమైన వ్యవసాయ ప్రణాళికను తయారు చేస్తామని తెలిపారు. ఈ ప్రణాళికను ప్రభుత్వానికి పంపి, వ్యవసాయానికి సంబంధించిన అన్ని అవసరాలను సకాలంలో రైతులకు అందజేయడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ ఉక్కాల శ్రీనివాసులు, అగ్రికల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call

## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్లానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పోట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# ఉప ముఖ్యమంత్రి పర్యటనపై అధికారులతో కలెక్టర్ సమీక్ష



**అమలాపురం, (రాజధాని వార్తలు):** ఈ నెల 26 బుధవారం కేసన పల్లి, శివకోడులలో జరగనున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పర్యటనకు సంబంధించి ఎటువంటి తొక్కిసలాటకు, శాంతి భద్రతలకు విఘాతం కలుగ కుండా పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, రహదారులు భవనాల శాఖ, డ్రైనేజీ, జల వనరులు, ఉద్యాన, వ్యవసాయ,కాలుష్య నియంత్రణ మండలి, అటవీ శాఖ, అగ్నిమాపక విపత్తుల స్పందన శాఖ అధికారులతో ముందస్తుగా ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టార్ ఫాలోయింగ్ ఉన్న నాయకుడు ఉప ముఖ్యమంత్రి హోదాలో జిల్లా పర్యటనకు తొలిసారిగా వస్తున్నందున అభిమానులు, జనసైనికులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉందని దీనికి తగ్గట్టుగా ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలన్నారు. హెలిప్యాడ్ వద్ద రైతులతో ముఖా ముఖి చర్చలు నిర్వహించే ప్రాంతాలలో తక్కువ పరిమితులలో జనాభా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా శంకర గుప్తం మెయిన్ డ్రైనేజీ మూలంగా దెబ్బతిన్న కొబ్బరి తోటలు గురించి డ్రైనేజీ ఎప్పటినుండి పూడుకు పోయి కొబ్బరి తోటలు చనిపోతున్నాయో కాలువ ఏర్పాటు నాటి నుండి నేటి వరకు చరిత్రను వివరంగా తెలిపేలా పూర్తి వివరాలతో నివేదికను సిద్ధం చేయాలన్నారు. ఎన్ని గ్రామాలు ఈ డ్రైనేజీ కాలువ మూలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో నివేదించాలన్నారు. మురుగు కాలువ ప్రారంభంనాటి వెడల్పు, లోతు ప్రవహించే మురుగునీటి పరిణామాలను ప్రస్తుతం తగ్గిన మురికినీటి ప్రవాహాలను లెక్క కట్టి నివేదికలో పొందుపరచాలన్నారు. అలాగే ఉద్యాన శాఖ కొబ్బరి తోటలు మురుగు కాలవ మూలంగా చనిపోవడానికి గల కారణాలను విశ్లేషిస్తూ నివేదిక సిద్ధం చేయాలని అదేవిధంగా మురుగు నీటిలో తట్టుకునే కొబ్బరి వంగడాల రకా లను తెలపడంతోపాటుగా చేపట్టాల్సిన చర్యలను స్పష్టంగా వివరించాలని అన్నారు. త్రాగునీటి కలుషి తం కాకుండా జల జీవన్ మిషన్ ద్వారా చేపట్టాల్సిన చర్యలు, నివేదిక రూపకల్పన చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు పీ శ్రీకర్, దేవరకొండ అఖిల, డ్రైనేజీ విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ ఎం వి వి కిషోర్, జిల్లా వ్యవసాయ అధికారి వి బోసుబాబు, జిల్లా అటవీ శాఖ అధికారి ఎం వి ప్రసాద్ రావు,ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ బి రాము, జల వనరుల శాఖ ఈఈ శ్రీనివాసరావు, కాలుష్య నియంత్రణ మండలి ఈ ఈ శంకర్రావు, జిల్లా ఉద్యాన అధికారి బి వి రమణ తదితరులు పాల్గొ న్నారు.

# జన్మదిన వేడుకలో అన్న క్యాంటీన్ వద్ద అన్నదాన కార్యక్రమం

**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** పెళ్లకూరు మండల బిసి సంఘం యువ నాయకుడు కాల గంధ లోకేష్ సతీమణి మునీశ్వరి జన్మదిన వేడుకను నాయుడుపేట పట్టణంలోని అన్నా క్యాంటీన్ వద్ద జరుపుకున్నారు. పుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయాలనే ఆలోచనతో కాల గంధ మునేశ్వరి సోమవారం మధ్యాహ్న భోజనం 400 వందల మందికి వడ్డించే టోకన్లను కొనుగోలు చేసి పేదలకు ఉచిత అన్నదానం వడ్డించారు.

అన్న క్యాంటీన్‌లో వడ్డించే ఆహార పదార్థాలతో పాటు అదనంగా అరటిపండు, స్వీట్ సరఫరా చేశారు. పుట్టినరోజు వేడుకల్లో సన్మానించుకోవడం, వృధాగా లేనిపోని కార్యక్రమాలు చేయడం కన్నా కొందరి ఆకలి తీర్చే అన్నదానం చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని దంపతులు అభిప్రాయ పడ్డారు. క్యాంటీన్‌లో ఆకలి తీర్చుకున్న వారంతా మునీశ్వరికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆ దేవుని చల్లని దీవెనలతో పాటు, నిండు నూరేళ్లు వర్ధిల్లాలని దీవెనలు అందించారు. ఈ కార్యక్రమంలో వారి కుమార్తెలైన భవ్య శ్రీ, లోక్షిత, బంధువులు, స్నేహితులు, పుట్టినరోజు వేడుకలో పాల్గొన్నారు.

# పాపనపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన స్త్రీ శిశు సంక్షేమ శాఖ గ్రేడ్ వన్ సూపర్వైజర్ ప్రియాంక





**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి రూరల్ మండలం పాపనపల్లి అంగన్వాడి కేంద్రాన్ని స్త్రీ శిశు సంక్షేమ శాఖ గ్రేడ్ వన్ సూపర్వై జర్ ప్రియాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం ఆమె అంగన్వాడి కేంద్రాన్ని ఆర్కెస్మికంగా తనిఖీ చేసి పిల్లల హాజరు నమోదు గర్భిణీ స్త్రీలకు బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా జరుగుచున్నదా లేదా పిల్లలకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా, లేదా పరిశీలించారు.

పిల్లల ఎత్తుకు తగ్గ బరువు వయసుకు తగ్గ బరువు ఉన్నారా అని పరిశీలించారు. పిల్లల వ్యక్తిగత శుభ్రతను పరిశీలించి, వారికి నాణ్యమైన భోజనంతో పాటు అంగనవాడి కేంద్రంలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలని ఆట పాటలతో కృత్యాలను సులభరీతిలో పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధించాలని తెలిపారు కార్యక్రమంలో ప్రగతి స్వచ్ఛంద సంస్థ పిల్లలకు చేపట్టిన కార్యక్రమాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రగతి స్వచ్ఛంద సంస్థ శ్రీకాళహస్తి మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ కో కన్వీనర్ రామచంద్రయ్య అంగనవాడి టీచర్ మాధవి సహాయకురాలు జ్యోతి గర్భిణీ స్త్రీలు బాలింతలు పాల్గొన్నారు.

# సంఘటన్ శ్రీజన్ అభియన్‌లో భాగంగా సంస్థాగత నిర్మాణ వేగం

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత బలోపేతం లక్ష్యంగా సంఘటన్ శ్రీజన్ అభియన్ కార్యక్రమం భాగంగా ఏఐసీసీ పరిశీలకురాలు, తమిళనాడు ఎంపీ సుధా రామకృష్ణన్ పర్యటించారు. డీసీసీ బాలగురవం బాబు అధ్యక్షతన, నియోజకవర్గ సమన్వయకర్త తలాపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ఆమెకు స్థానిక నేతలు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుధా రామకృష్ణన్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులు గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయివరకు మరింత క్రమశిక్షణతో పని చేయాలి అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలం సంస్థాగత నిర్మాణంలోనే ఉంది. శక్తివంతమైన బూత్ కమిటీలు పార్టీ విజయానికి పునాది. నాయకత్వం చెప్పిన దిశలో ప్రతి కార్యకర్త ప్రజలకు చేరాలి, వారి సమస్యలను పరిష్కరించాలని పేర్కొనారు. నియోజకవర్గం మొత్తం కాంగ్రెస్ సిద్ధాంతాలతో ముందుకు సాగే విధంగా బలోపేతం చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశీలకులు మదన్ మోహన్ రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కలిందర్, జిల్లా ఉపాధ్యక్షులు శబరి రాజన్ రెడ్డి, మురళి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీను గౌడ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు జ్యోతిశ్వర్ నాయక్, ఓబిసి సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు నాయకుల ఫయాజ్, ఎల్ ఎస్ యు వై జిల్లా అధ్యక్షులు శివ బాలాజీ, కేకేసి జిల్లా అధ్యక్షులు బి చిరంజీవులు, మైనారిటీ ఉపాధ్యక్షులు రాజిక్, కేకేసి ఉపాధ్యక్షులు కృపానందం, జిల్లా కార్యదర్శి ఇళయరాజా, ఎంకే మనీ, మండల అధ్యక్షులు తిరుమల, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, శ్రీకాళహస్తి మండల యువజన అధ్యక్షులు నవీన్, తొట్టంబేడు మండల నాయకులు కామి నాగరాజు, మహిళ నాయకురాలు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan